


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్ గిరి | సోమవారం | 24.08.2026 | సంపుటి: 3 | సంచిక: 201 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 24.08.2026 | VOLUME : 3 | ISSUE : 201 | PAGES: 8 | COST: 2/- |




## తెలంగాణ బీజేపీలో
# మిషన్ 2029 మంటలు

- కోర్ టీమ్‌లో డీకే అరుణకు దక్కని చోటు
- అధికారం లక్ష్యంగా బీజేపీ వ్యూహాలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య ప్రధాన పోరు
- అంతర్గత విభేదాలతో పార్టీకి ఎదురుదెబ్బ
- ఒంటరి పోరుపై నేతల్లో భిన్నాభిప్రాయాలు

**హైదరాబాద్, ఆగస్టు 23:** తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా బీజేపీ జాతీయ నాయకత్వం 'మిషన్ 2029' పేరుతో కొత్త వ్యూహాత్మక బృందాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, రాష్ట్రానికి చెందిన కీలక నేతలకు అందులో తగిన ప్రాధాన్యం దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు కోర్ టీమ్‌లో చోటు దక్కకపోవడం పార్టీ వర్గాల్లో అసంతృప్తికి కారణమైంది. మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య ప్రధాన రాజకీయ పోటీ కొనసాగుతుండగా, బీజేపీ క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో దూకుడు ప్రదర్శించలేకపోతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**డీకే అరుణకు దక్కని ప్రాధాన్యం**

తెలంగాణలో బలమైన ప్రజా మద్దతు ఉన్న నేతగా గుర్తింపు పొందిన డీకే అరుణకు మిషన్ 2029 బృందంలో చోటు లేకపోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. 2019లో

మిగతా 2వ పేజీలో..

## తెలంగాణ అభివృద్ధికి
# ప్రవాసుల సహకారం

### ప్రపంచవ్యాప్తంగా 'తెలంగాణ రైజింగ్'ను ప్రచారం చేయాలి: రేవంత్‌రెడ్డి

- పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యం
- అభివృద్ధి, ఉపాధి అవకాశాలను ప్రవాసులకు వివరించిన సీఎం
- రాష్ట్ర పురోగతిలో ప్రవాసుల పాత్ర కీలకమని వ్యాఖ్య
- పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నాం: శ్రీధర్‌బాబు
- ప్రపంచ వేదికపై తెలంగాణను నిలబెట్టేందుకు కలిసి పనిచేద్దామని పిలుపు

2

### అనుమతి నిరాకరణపై రేవంత్ అసంతృప్తి

- కేంద్రం కక్ష సాధింపు చర్యలేనని ఆరోపణ
- అమెరికా పర్యటనకు విదేశాంగ శాఖ అనుమతి నిరాకరణ

2






## ఫర్నిచర్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

- అర్ధరాత్రి చెలరేగిన మంటలు.. దట్టమైన పొగతో భయాందోళన
- మంటలు ఇతర గోదాంలకు వ్యాపించకుండా చర్యలు

3

## ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ వ్యాన్ సమ్మె విరమణ

- మంత్రి పొన్నంతో చర్చలు సఫలం
- అర్ధరాత్రి నుంచి జరగాల్సిన సమ్మెకు బ్రేక్
- కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు
- సంక్షేమ బోర్డు ఏర్పాటుకు హామీ
- ఈవీ ఆటోల ప్రతిపాదనపై సానుకూల స్పందన
- ప్రయాణికులకు తప్పిన రవాణా ఇబ్బందులు

2





## కొండా సురేఖతో
# ఖర్గే భేటీ

- కుమార్తె వ్యాఖ్యలపై ఆరా.. రాజకీయ పరిణామాలపై చర్చ
- బెంగళూరులో 15 నిమిషాల పాటు సమావేశం
- సుస్మిత వ్యాఖ్యలపై ఖర్గే ప్రశ్నలు
- పార్టీకి నష్టం కలిగించే వ్యాఖ్యలు వద్దని సూచన
- ఘటనపై ఖర్గేకు సురేఖ వివరణ
- రాష్ట్ర నేతల అపాయింట్‌మెంట్ దక్కకపోవడంతో భేటీ

**బెంగళూరు, ఆగస్టు 23:** తెలంగాణ మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో బెంగళూరులో హఠాత్తుగా సమావేశమయ్యారు. సుమారు 15 నిమిషాల

మిగతా 2వ పేజీలో..

## గచ్చిబౌలిలో సాజిద్ అక్రమ నిర్మాణాల బాగోతం

- నిబంధనలకు విరుద్ధంగా భవనాల నిర్మాణం
- పీజీ హాస్టళ్లుగా మార్చి భారీగా అద్దెల వసూళ్లు
- సాజిద్‌పై గతంలోనే ఫిర్యాదులు ఉన్నట్లు వెల్లడి
- అక్రమ నిర్మాణాలపై హైడ్రా ప్రత్యేక దృష్టి

3

## గచ్చిబౌలిలో మరో భవనం కూల్చివేత

- ఏడంతస్తుల భవనానికి ప్రమాదం తప్పించే చర్యలు
- శిథిలాలతో దెబ్బతిన్న భవనంపై చర్యలు
- సీఎంసీ, హైడ్రా బృందాల సంయుక్త ఆపరేషన్
- భారీ యంత్రాలతో కూల్చివేత
- అపార్ట్‌మెంట్ వాసులను ఖాళీ చేయించిన అధికారులు
- అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

3





## జిల్లా స్థాయిలో 90 శాతం వైద్య సేవలు

- ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తున్నాం: దామోదర్ రాజనర్సింహ
- నారాయణఖేడ్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం
- ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి
- జిల్లా స్థాయిలోనే ప్రత్యేక చికిత్సలు
- ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసం

2

## చైనాకు అజిత్ దోవల్..

- వాంగ్ యీతో 25వ విడత ప్రత్యేక ప్రతినిధుల భేటీ
- భారత్–చైనా సరిహద్దు వివాదమే ప్రధాన అజెండా
- ద్వైపాక్షిక సంబంధాలపైనా చర్చించే అవకాశం
- బ్రిక్స్ సదస్సుకు ముందు కీలక సమావేశం



4

## పార్లమెంట్ ప్రోరోగేషన్‌పై ఉత్కంఠ

- పది రోజులు దాటినా జారీ కానీ ఉత్తర్వులు
- మహిళా రిజర్వేషన్ సవరణపై మళ్లీ ఊహాగానాలు
- డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల ఆందోళన
- ప్రత్యేక సమావేశం ఉంటుందా?
- కేంద్రం వ్యూహంపై కాంగ్రెస్ ప్రశ్నలు

4



## మళ్లీ సిద్ధమైన జైషే ఉగ్ర స్థావరం!

- ఆపరేషన్ సిందూర్‌లో దెబ్బ..
- 15 నెలల తర్వాత పునర్నిర్మాణం
- పాక్ ప్రభుత్వమే నిధులిచ్చినట్లు సమాచారం
- బహవల్పూర్‌లోని మార్కజ్ సుభాన్ అల్లా



4

# అనుమతి నిరాకరణపై రేవంత్ అసంతృప్తి

- కేంద్రం కక్ష సాధింపు చర్యలేనని ఆరోపణ
- అమెరికా పర్యటనకు విదేశాంగ శాఖ అనుమతి నిరాకరణ
- లండన్ నుంచే హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం
- ఖర్గేకు సీఎం రేవంత్ ప్రత్యేక ధన్యవాదాలు
- లండన్‌లో ముగిసిన అధికారిక కార్యక్రమాలు
- హైదరాబాద్‌కు వచ్చాక పూర్తి వివరాలు వెల్లడిస్తానని ప్రకటన

**హైదరాబాద్, ఆగస్టు 23:**

అమెరికా పర్యటనకు విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. అనుమతి లభించకపోవడంతో లండన్ నుంచే నేరుగా హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ వ్యవహారంపై సామాజిక మాధ్యమం ద్వారా స్పందించిన సీఎం కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు.

**ఖర్గేకు కృతజ్ఞతలు**

తన విదేశీ పర్యటనకు అనుమతి నిరాకరణపై స్పందించి తనకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. దేశవ్యాప్తంగా తనకు మద్దతుగా స్పందించిన పార్టీ నాయకులు, ప్రజలకు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

**లండన్ పర్యటన విజయవంతం**

లండన్‌లో గత మూడు రోజులుగా నిర్వహించిన అన్ని అధికారిక కార్యక్రమాలు, సమావేశాలు విజయవంతంగా ముగిశాయని సీఎం పేర్కొన్నారు. లండన్ పర్యటనలో నిర్ణయించిన కార్యక్రమాలను పూర్తి చేసినట్లు తెలిపారు.

**బోస్టన్ పర్యటన రద్దు**

విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించడంతో బోస్టన్‌లో నిర్వహించాల్సిన కార్యక్రమాలు రద్దయ్యాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. దీంతో షెడ్యూల్‌లో మార్పు చేసుకుని లండన్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరినట్లు వెల్లడించారు.

**హైదరాబాద్‌కు వచ్చాక వివరణ**

విదేశీ పర్యటనలకు అనుమతి నిరాకరించడం, అందుకు దారితీసిన కారణాలపై హైదరాబాద్‌కు చేరుకున్న తర్వాత మీడియా ముందుకు వచ్చి పూర్తి వివరాలు వెల్లడిస్తానని సీఎం స్పష్టం చేశారు. కేంద్ర నిర్ణయం వెనుక ఉన్న అంశాలను ప్రజలకు వివరిస్తానని తెలిపారు.

# కొండా సురేఖతో ఖర్గే భేటీ

**మొదటిపేజీ తరువాయి**

పాటు జరిగిన ఈ భేటీలో ఇటీవల సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు, అనంతరం చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై చర్చ జరిగినట్లు సమాచారం.

**సుస్మిత వ్యాఖ్యలపై ఆరా**

కుమార్తె చేసిన వ్యాఖ్యలపై ఖర్గే నేరుగా సురేఖను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. పార్టీకి ఇబ్బంది కలిగించేలా బహిరంగ వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు పార్టీ క్రమశిక్షణను పాటిస్తూ మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించినట్లు తెలిసింది.

**ఘటనపై సురేఖ వివరణ**

ఖర్గే అడిగిన ప్రశ్నలకు మంత్రి సురేఖ వివరణ ఇచ్చారు. సుస్మిత చేసిన వ్యాఖ్యల వెనుక ఉన్న పరిస్థితులు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలను వివరించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో తన ప్రమేయం లేదని, కుమార్తె చేసిన వ్యాఖ్యలను తనకు ఆపాదించడం సరికాదని ఆమె ఇప్పటికే పార్టీ క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే.

**అపాయింట్‌మెంట్ దక్కకపోవడంతో**

రాష్ట్రానికి చెందిన కొందరు ముఖ్య నేతలను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరినా సమయం లభించకపోవడంతోనే నేరుగా ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసినట్లు సురేఖ వివరించినట్లు సమాచారం. తాజా పరిణామాల నేపథ్యంలో ఖర్గేతో ఆమె భేటీ కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



# జిల్లా స్థాయిలో 90 శాతం వైద్య సేవలు

**నారాయణఖేడ్:**




తెలంగాణలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన బాలాజీ అనురాధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి అందుబాటులో ఉన్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు.

**జిల్లా స్థాయిలోనే ప్రత్యేక వైద్యం**

రాష్ట్రంలో ప్రస్తుతం 90 శాతం వైద్య చికిత్సలు జిల్లా స్థాయిలోనే అందేలా ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. చిన్నచిన్న వైద్య అవసరాల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా అన్ని రకాల ప్రత్యేక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు.

**ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం**

విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక పరికరాలు, నాణ్యమైన వైద్య సేవలు, నిపుణులైన వైద్యులను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. దీంతో ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని అన్నారు.

**గ్రామీణ ప్రాంతాలకు ప్రయోజనం**

నారాయణఖేడ్ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసిన నిర్వాహకులను మంత్రి అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం వల్ల స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఆరోగ్య రంగంలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు.

**నాణ్యమైన వైద్యమే లక్ష్యం**

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, సబ్ కలెక్టర్ హరిణి, ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ పట్లోళ్ల అనురాగ్ రెడ్డి, డాక్టర్ కే. శ్రీధర్, ప్రజాప్రతినిధులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.






# తెలంగాణ అభివృద్ధికి ప్రవాసుల సహకారం

**లండన్, ఆగస్టు 23:**

తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలను ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలుగు ప్రవాసులకు పిలుపునిచ్చారు. లండన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ప్రవాసులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమం ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి పెట్టుబడుల కేంద్రంగా, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు.

**అభివృద్ధి ప్రణాళికలపై చర్చ**

రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల విస్తరణపై సీఎం ప్రవాసులకు వివరించారు. విద్య, సాంకేతిక రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను కూడా వివరించారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధిలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సమాజం భాగస్వామ్యం కావాలని కోరారు.

**ప్రవాసులు రాయబారులుగా నిలవాలి**

ప్రపంచవ్యాప్తంగా ప్రవాసులకు ఉన్న పరిచయాలు, అనుభవాలు, నైపుణ్యాలను తెలంగాణ పురోగతికి వినియోగించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. 'తెలంగాణ రైజింగ్' లక్ష్యాలను ఆయా దేశాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ రాష్ట్రానికి మంచి రాయబారులుగా నిలవాలని కోరారు. రాష్ట్రాన్ని ప్రపంచ వేదికపై మరింత బలంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం, ప్రవాస తెలుగు సమాజం కలిసి పనిచేయాలని అన్నారు.

**పెట్టుబడులకు అనుకూల వాతావరణం**

తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సాంకేతికత, ఆవిష్కరణలు, పరిశ్రమల విస్తరణకు తీసుకుంటున్న చర్యలను ప్రవాసులకు వివరించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న కొత్త అవకాశాలను గుర్తించి పెట్టుబడులు పెట్టాలని కోరారు.

**అభివృద్ధిలో భాగస్వామ్యం**

సమావేశంలో పాల్గొన్న తెలుగు ప్రవాసులు తెలంగాణ అభివృద్ధి కార్యక్రమాలపై ఆసక్తి వ్యక్తం చేశారు. విద్య, ఆరోగ్యం, సాంకేతికత, పరిశ్రమల రంగాల్లో తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. రాష్ట్ర పురోగతికి అవసరమైన సూచనలు, సలహాలను ప్రభుత్వ ప్రతినిధులతో పంచుకున్నారు. 'తెలంగాణ రైజింగ్' లక్ష్యాల సాధనలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి తెలుగు వ్యక్తి భాగస్వామి కావాలని సీఎం ఆకాంక్షించారు.

# భారత్ అంతరిక్ష విజయాలు యువతకు స్ఫూర్తి: రేవంత్‌రెడ్డి

- శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు సీఎం అభినందనలు
- చంద్రయాన్-3 విజయం చారిత్రక ఘట్టమని వ్యాఖ్య
- తెలంగాణను స్పేస్‌టెక్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం
- పరిశోధనలు, ఆవిష్కరణలకు ప్రోత్సాహం
- యువత పెద్ద లక్ష్యాలతో ముందుకు సాగాలి

**హైదరాబాద్, ఆగస్టు 23:**

జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి దేశ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, అంతరిక్ష రంగంలో పనిచేస్తున్న సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్ష పరిశోధనల్లో భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన వారి కృషిని ప్రశంసించారు. చంద్రయాన్3 విజయంతో చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందని పేర్కొన్నారు.

**చంద్రయాన్-3 చారిత్రక విజయం**

చంద్రయాన్3 విజయంతో ప్రపంచానికి భారత శాస్త్ర, సాంకేతిక సామర్థ్యం మరోసారి నిరూపితమైందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ఘనత దేశ ప్రతిష్ఠను మరింత పెంచిందని, ప్రతి భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులందరినీ అభినందించారు.

**శాస్త్రవేత్తల కృషి ప్రశంసనీయం**

చంద్రయాన్3 వంటి విజయాల వెనుక శాస్త్రవేత్తల అంకితభావం, ఏళ్ల తరబడి సాగిన పరిశోధనలు, నిరంతర కృషి ఉన్నాయని సీఎం తెలిపారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సాధిస్తున్న విజయాలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు.

**తెలంగాణ స్పేస్‌టెక్ హబ్‌గా**

అంతరిక్ష, సాంకేతిక రంగాల్లో తెలంగాణ కూడా ముందంజలో ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. స్టార్టప్‌లకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో రాష్ట్రం స్పేస్‌టెక్ హబ్‌గా రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. పరిశోధనలు, ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధికి తెలంగాణను కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

**యువత ఆవిష్కరణల వైపు**

యువత కొత్త ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని సీఎం సూచించారు. పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు పట్టుదలతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. విజ్ఞానం, పరిశోధనలు, సాంకేతిక నైపుణ్యాలే భవిష్యత్ అభివృద్ధికి కీలకమని అన్నారు. భారత యువత ప్రపంచ స్థాయి విజయాలను సాధించే సామర్థ్యం కలిగి ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. అంతరిక్ష రంగంలో భారత్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.




# ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ వ్యాన్ సమ్మె విరమణ

**హైదరాబాద్, ఆగస్టు 23:**

తెలంగాణలో ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లు అర్ధరాత్రి నుంచి చేపట్టాలని నిర్ణయించిన నిరవధిక సమ్మె విరమించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. దీంతో హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులకు రవాణా ఇబ్బందులు తప్పాయి.

**చర్చలకు ఆహ్వానించిన ప్రభుత్వం**

ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ వ్యాన్‌లను నిలిపివేయాలని కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపునిచ్చింది. సమ్మెకు ముందే ప్రభుత్వం స్పందించి సంఘాల ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో కార్మికుల సమస్యలపై చర్చించారు.

**సంక్షేమ బోర్డుపై హామీ**

ప్రైవేట్ రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సంఘాల ప్రతినిధులు ప్రధానంగా డిమాండ్ చేశారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సంక్షేమ బోర్డు ఏర్పాటుపై మంత్రి సానుకూల హామీ ఇచ్చినట్లు సంఘాల ప్రతినిధులు తెలిపారు.

**ఈవీ ఆటోల ప్రతిపాదనపై చర్చ**

ఆర్టీసీ ద్వారా విద్యుత్ ఆటోలను ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాలు కోరాయి. దీనిపై కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. డ్రైవర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిసింది.

**రోడ్డెక్కనున్న వాహనాలు**

ప్రభుత్వం నుంచి హామీలు లభించడంతో కార్మిక సంఘాల నేతలు సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ వ్యాన్‌లు సహా ప్రైవేట్ రవాణా వాహనాలు యథావిధిగా నడవనున్నాయి. అర్ధరాత్రి నుంచి సమ్మె జరిగితే ఎదురయ్యే ఇబ్బందులపై ఆందోళన చెందిన ప్రయాణికులకు తాజా నిర్ణయంతో ఊరట లభించింది.

## బంద్ విరమించండి..
# చర్చలకు రండి

**హుస్నాబాద్, ఆగస్టు 23:**

ఇవాళ అర్ధరాత్రి నుంచి తలపెట్టిన నిరవధిక బంద్‌ను విరమించుకోవాలని ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమ్మెలతో సమస్యలు పరిష్కారం కావని, చర్చల ద్వారానే వాటికి పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఆందోళనకు బదులు చర్చలకు ముందుకు రావాలని కోరారు.

**ఛార్జీల సవరణకు కమిటీ**

ఆటో కార్మికుల ప్రధాన డిమాండ్ అయిన ఛార్జీల పెంపుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి తెలిపారు. 2015 నుంచి రాష్ట్రంలో ఆటో ఛార్జీలు పెరగలేదని పేర్కొన్నారు. పెరుగుతున్న నిర్వహణ వ్యయాలను పరిగణనలోకి తీసుకుని ఛార్జీల సవరణపై అధ్యయనం చేసేందుకు త్వరలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రవాణా శాఖ అధికారులతో పాటు ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులకు కూడా కమిటీలో అవకాశం కల్పిస్తామని చెప్పారు.

**సంక్షేమ బోర్డు ఏర్పాటు**

ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కేబినెట్ ఇప్పటికే నిర్ణయించిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. బోర్డు కార్యకలాపాలు ప్రారంభించేందుకు అవసరమైన మార్గదర్శకాలను త్వరలో ఖరారు చేస్తామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించిన తరహాలోనే ఆటో కార్మికుల సమస్యలపైనా దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని డ్రైవర్ల సమస్యలను పరిగణనలోకి తీసుకుని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలిపారు.

**ఈవీ ఆటోలకు ప్రోత్సాహం**

పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా పాత డీజిల్, పెట్రోల్ ఆటోలను తొలగించి కొత్త ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసే డ్రైవర్లకు ప్రభుత్వ సహకారం అందిస్తామని మంత్రి చెప్పారు. పాత వాహనాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకునేందుకు రెట్రోఫిట్టింగ్ పథకాన్ని కూడా త్వరలో ప్రవేశపెడతామని వెల్లడించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని బంద్‌ను విరమించి చర్చలకు రావాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ బీజేపీలో 'మిషన్ 2029' మంటలు

**మొదటిపేజీ తరువాయి**

బీజేపీలో చేరిన ఆమె పార్టీ విస్తరణకు పనిచేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి విజయం సాధించారు. కేంద్ర మంత్రివర్గంలోనూ అవకాశం వస్తుందని భావించినప్పటికీ అది జరగలేదు. తాజాగా వ్యూహాత్మక బృందంలోనూ ఆమెకు ప్రాధాన్యం లేకపోవడం అధిష్ఠానం వ్యూహంపై చర్చకు దారితీసింది.

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో పోటీ**

రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకున్న బీజేపీ.. అధికారంలోకి రావడమే తమ లక్ష్యమని చెబుతోంది. అయితే క్షేత్రస్థాయిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ కనిపిస్తోందన్న విశ్లేషణలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలతో ప్రజల్లోకి వెళ్తుండగా, బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలను తీవ్రతరం చేస్తోంది. ఈ రెండు పార్టీల మధ్య పోటీలో బీజేపీ తన బలాన్ని ఓటు బ్యాంకుగా మలుచుకోవాల్సిన సవాలును ఎదుర్కొంటోంది.

**అంతర్గత విభేదాలే పెద్ద సవాలు**

తెలంగాణ బీజేపీలో నాయకుల మధ్య సమన్వయ లోపం పార్టీకి ప్రధాన సమస్యగా మారిందన్న చర్చ కొనసాగుతోంది. రాష్ట్ర స్థాయి నేతలు ఒకే వ్యూహంతో ముందుకు సాగకపోవడం, అంతర్గత విభేదాలు పార్టీ విస్తరణకు అడ్డంకిగా మారుతున్నాయన్న అభిప్రాయాలు ఉన్నాయి. తెలంగాణ నేతల మధ్య సమన్వయం పెంచుకోవాల్సిన అవసరంపై ప్రధాని నరేంద్ర మోదీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు గతంలో వార్తలు వెలువడ్డాయి.

**ఒంటరి పోరుపై ఆసక్తి**

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నరపరాజు రామచందర్‌రావు ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా చర్చకు దారితీశాయి. రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు లేకుండా బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. అయితే గ్రామస్థాయిలో పార్టీ నిర్మాణం ఇంకా బలోపేతం కావాల్సి ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం ఎంతవరకు ఫలిస్తుందనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

**వ్యూహం మార్చాల్సిందే**

మిషన్ 2029 లక్ష్యాన్ని చేరుకోవాలంటే తెలంగాణ బీజేపీ ముందుగా అంతర్గత విభేదాలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాన్ని విస్తృతం చేయడంతో పాటు బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా తమను తాము ప్రజల ముందు నిలబెట్టుకోవాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను బలోపేతం చేసి, నేతల మధ్య సమన్వయం పెంచుకుంటేనే రాబోయే ఎన్నికల్లో అధికార లక్ష్యం దిశగా బీజేపీ ముందుకు సాగగలదనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# గచ్చిబౌలిలో మరో భవనం కూల్చివేత

**గచ్చిబౌలి, ఆగస్టు 23:**

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ఆంజనేయనగర్‌లో శనివారం ఏడంతస్తుల భవనం కూలిన ఘటన నేపథ్యంలో పక్కనే ప్రమాదకరంగా మారిన మరో ఏడంతస్తుల భవనాన్ని అధికారులు ఆదివారం కూల్చివేశారు. సీఎంసీ, హైడ్రా బృందాలు సంయుక్తంగా చేపట్టిన ఈ చర్యతో చుట్టుపక్కల ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదాన్ని నివారించారు.

**శిథిలాలతో దెబ్బతిన్న భవనం**

సాజిద్‌కు చెందిన భవనం శనివారం కూలిపోవడంతో దాని శిథిలాలు పక్కనే ఉన్న మరో ఏడంతస్తుల భవనంపై పడ్డాయి. దీంతో ఆ నిర్మాణం తీవ్రంగా దెబ్బతిని ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదకర పరిస్థితికి చేరింది. భవనం చుట్టుపక్కల ప్రజలకు, ఇతర నిర్మాణాలకు ముప్పు ఉందని సీఎంసీ అధికారులు నిర్ధారించారు.

**భారీ యంత్రాలతో కూల్చివేత**

సీఎంసీ అధికారుల అభ్యర్థన మేరకు హైడ్రా బృందాలు రంగంలోకి దిగి కూల్చివేత చేపట్టాయి. రెండు భవనాలు అత్యంత సమీపంలో, మధ్యలో ఖాళీ స్థలం లేకుండా నిర్మించడంతో కూల్చివేత క్లిష్టంగా మారింది. 'బాహుబలి' జేసీబీ వంటి భారీ యంత్రాలతో చుట్టుపక్కల నిర్మాణాలకు నష్టం కలగకుండా జాగ్రత్తగా పనులు చేపట్టారు.

**అపార్ట్‌మెంట్ వాసుల తరలింపు**

కూల్చివేత సందర్భంగా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా సమీపంలోని స్టెర్లింగ్ వైట్‌ఫీల్డ్ అపార్ట్‌మెంట్ నివాసితులను ఇళ్ల నుంచి ఖాళీ చేయించారు. ప్రమాదకర ప్రాంతంలోకి ఎవరూ వెళ్లకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కూల్చివేత పూర్తయ్యే వరకు పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

**50 గజాల్లో ఏడంతస్తులు**

ఆంజనేయనగర్‌లో అనుమతులు లేకుండానే కేవలం 50 గజాల స్థలంలో ఏడంతస్తుల భవనాలు నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఇలాంటి నిర్మాణాలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఘటన నేపథ్యంలో అక్రమ నిర్మాణాలపై మరింత కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.







# పవర్ ఎగ్జిబిషన్‌కు భారీ స్పందన

- విద్యుత్ సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన
- రెండో రోజు సందర్శకులతో కళకళలాడిన ప్రదర్శన
- విద్యుత్ పంపిణీ వ్యవస్థపై విద్యార్థుల ఆసక్తి
- స్మార్ట్ మీటర్లు, డిజిటల్ సేవలపై అవగాహన
- విద్యుత్ భద్రతపై ప్రత్యక్ష ప్రదర్శనలు
- యువతలో సాంకేతిక ఆసక్తి పెంపే లక్ష్యం

**హైదరాబాద్, ఆగస్టు 23:**

హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవర్ ఎగ్జిబిషన్-2026 రెండో రోజు సందర్శకులతో సందడిగా మారింది. పాఠశాల విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రదర్శనను సందర్శించి విద్యుత్ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికత, పంపిణీ వ్యవస్థ, భద్రతా ప్రమాణాలు, సంస్కరణలపై అవగాహన పొందారు.

**సాంకేతికతపై ఆసక్తి**

విద్యార్థులు వివిధ స్టాళ్లను సందర్శిస్తూ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి వినియోగదారుల ఇళ్లకు సరఫరా అయ్యే విధానాన్ని అధికారులు, ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు, స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భద్రతా పరికరాలు, డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థలు, పునరుత్పాదక ఇంధన వనరులపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

**ఆధునిక సేవలపై అవగాహన**

విద్యుత్ రంగంలో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ ఆధారిత సేవలు, కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును అధికారులు వివరించారు. విద్యుత్ అంతరాయాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, వినియోగదారులకు అందిస్తున్న ఆన్‌లైన్ సేవలపై కూడా సందర్శకులకు అవగాహన కల్పించారు.




**భద్రతపై ప్రత్యక్ష ప్రదర్శనలు**

విద్యుత్ భద్రతకు సంబంధించిన స్టాళ్లలో ప్రమాదాల నివారణ, సురక్షిత వినియోగ పద్ధతులు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులతో పాటు సాధారణ సందర్శకులు కూడా వీటిని ఆసక్తిగా తిలకించారు.

**అభివృద్ధిని ప్రజలకు చేరువగా**

మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన ద్వారా తెలంగాణ విద్యుత్ రంగంలో జరుగుతున్న అభివృద్ధి, సాంకేతిక పురోగతి, వినియోగదారుల సేవల మెరుగుదలపై ప్రజలకు ప్రత్యక్ష అవగాహన కల్పించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. విద్యుత్ సంస్థల ఆధునికీకరణ, హరిత ఇంధన ప్రాజెక్టులు, డిజిటల్ సేవలు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తున్న ప్రణాళికలను ప్రజలకు పరిచయం చేస్తున్నామని పేర్కొన్నారు. రెండో రోజే భారీగా సందర్శకులు తరలిరావడంతో చివరి రోజు మరింత రద్దీ ఉండే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.

# ప్రాంక్ మెసేజ్‌తో బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

- కిడ్నాప్ అంటూ ప్రియురాలికి యువకుడి మెసేజ్
- 112కు సమాచారం ఇవ్వడంతో రంగంలోకి పోలీసులు
- కేపీహెచ్‌బీ ఫ్లాట్‌లో రూ.30 లక్షల నగదు స్వాధీనం
- మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు పోలీసుల ఆధీనంలోకి

**హైదరాబాద్, ఆగస్టు 23, సిరి న్యూస్:**

ఒక యువకుడు సరదాగా చేసిన ప్రాంక్ మెసేజ్ హైదరాబాద్‌లో సాగుతున్న భారీ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారాన్ని పోలీసుల ముందు పెట్టింది. తనను కొందరు కిడ్నాప్ చేశారంటూ ప్రియురాలికి పంపిన సందేశంతో ఆమె అత్యవసర నంబర్ 112కు సమాచారం ఇవ్వడంతో కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) పోలీసులు రంగంలోకి దిగారు. యువకుడు నివసిస్తున్న ఫ్లాట్‌లో సోదాలు చేయగా రూ.30 లక్షల నగదు, బెట్టింగ్‌కు ఉపయోగిస్తున్న మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు బయటపడటంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

**కిడ్నాప్ అంటూ ప్రాంక్**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుమంత్, మనోజ్, గౌతమ్ ముగ్గురు యువకులు కేపీహెచ్‌బీ పరిధిలోని ఓ ఫ్లాట్‌లో ఉంటున్నారు. వారిలో ఒకరు సరదాగా తనను కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారంటూ ప్రియురాలికి సందేశం పంపాడు. అది నిజమేనని భావించిన యువతి ఆందోళనకు గురై వెంటనే 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించింది.

**ఫ్లాట్‌లో సోదాలతో అసలు విషయం**

యువతి సమాచారంతో పోలీసులు వెంటనే సంబంధిత ఫ్లాట్‌కు చేరుకున్నారు. అక్కడ కిడ్నాప్‌కు సంబంధించిన ఎలాంటి ఆధారాలు కనిపించకపోగా, అనుమానాస్పదంగా ఉన్న నగదు, ఎలక్ట్రానిక్ పరికరాలను గుర్తించారు. సోదాల్లో రూ.30 లక్షల లెక్కల్లో లేని నగదుతో పాటు బెట్టింగ్‌కు వినియోగిస్తున్న పలు మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లను స్వాధీనం చేసుకున్నారు.

**ముగ్గురి అరెస్ట్**

ప్రాంక్ మెసేజ్ పంపిన యువకుడితో పాటు ఫ్లాట్‌లో ఉన్న సుమంత్, మనోజ్, గౌతమ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ద్వారా సమకూరినదిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం.

**నెట్‌వర్క్‌పై దర్యాప్తు**

ఫ్లాట్ కేంద్రంగా ఎంతకాలంగా బెట్టింగ్ నిర్వహిస్తున్నారు? ఈ వ్యవహారంలో మరెవరెవరి ప్రమేయం ఉంది? నగదు లావాదేవీలు ఎలా జరిగాయి? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సరదాగా పంపిన ఓ కిడ్నాప్ మెసేజ్ చివరకు భారీ బెట్టింగ్ ముఠా గుట్టును రట్టు చేయడం ఆసక్తికరంగా మారింది.

# ఫర్నిచర్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

- అర్ధరాత్రి చెలరేగిన మంటలు
- దట్టమైన పొగతో భయాందోళన
- మంటలు ఇతర గోదాంలకు వ్యాపించకుండా చర్యలు
- షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని అంచనా
- భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం

**హైదరాబాద్, ఆగస్టు 23:**

హైదరాబాద్ నగరంలోని గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొగల్ కా నాలా సమీపంలోని ఫర్నిచర్ గోదాంలో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గోదాంలో ఫర్నిచర్, ప్లైవుడ్, రసాయనాలు, ఇతర మండే వస్తువులు పెద్దమొత్తంలో ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. క్షణాల్లోనే దట్టమైన నల్లటి పొగలు కమ్ముకోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

**రంగంలోకి అగ్నిమాపక సిబ్బంది**

సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు పక్కనే ఉన్న గోదాంలు, ఇళ్లకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. దట్టమైన పొగ కారణంగా సహాయక చర్యలకు ఇబ్బందులు ఎదురైనా సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు.

**కారణంపై దర్యాప్తు**

ప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా నిర్ధారణ కాలేదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు చెలరేగి ఉండొచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత నష్టం వివరాలు స్పష్టంగా తెలిసే అవకాశం ఉంది









## గచ్చిబౌలిలో సాజిద్ అక్రమ నిర్మాణాల బాగోతం

**హైదరాబాద్, ఆగస్టు 23:**

గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం కూలిన ఘటనతో బిల్డర్ సాజిద్ ఖాన్ అక్రమ నిర్మాణాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అతను నిర్మించిన పలు భవనాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. చిన్న స్థలాల్లో అనుమతులకు మించి అంతస్తులు నిర్మించి, వాటిని పీజీ హాస్టళ్లుగా మార్చి భారీగా అద్దెలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**చిన్న స్థలాల్లో భారీ నిర్మాణాలు**

గతంలో మెకానిక్‌గా పనిచేసిన సాజిద్ ఖాన్ అనంతరం నిర్మాణ రంగంలోకి వచ్చినట్లు సమాచారం. చిన్న స్థలాలను కొనుగోలు చేసి, నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. అనంతరం వాటిని పీజీ వసతి కేంద్రాలుగా మార్చి విద్యార్థులు, ఉద్యోగుల నుంచి అద్దెలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**హైడ్రా దృష్టి**

సాజిద్ అక్రమ నిర్మాణాలపై గతంలోనే పలు ఫిర్యాదులు అందినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. దీంతో సైబరాబాద్ పరిధిలో అతను నిర్మించిన భవనాలపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చర్యలకు అధికారులు సిద్ధమవుతున్నారు.

**అధికారుల పాత్రపై ఆరా**

అక్రమ నిర్మాణాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన టౌన్ ప్లానింగ్ అధికారుల వివరాలను మున్సిపల్ అధికారులు సేకరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు సహకరించినట్లు తేలితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

**మరో భవనం కూల్చివేతకు సిద్ధం**

ప్రమాద స్థలంలో శిథిలాల తొలగింపు కొనసాగుతోంది. నేలమట్టమైన భవనం శిథిలాలను పూర్తిగా తొలగించిన తర్వాత వెనుక ఉన్న మరో అక్రమ జీ+6 భవనాన్ని కూల్చివేయనున్నారు. ముందుజాగ్రత్తగా జయదర్శిని అపార్ట్‌మెంట్ సీ బ్లాక్ వాసులు ఖాళీ చేసి వెళ్లిపోయారు.

**పరారీలో సాజిద్**

భవనం యజమాని సాజిద్ ఖాన్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. అతనిపై ఇప్పటికే కేసు నమోదు చేశారు. ఘటన నేపథ్యంలో సైబరాబాద్ పరిధిలో అతను నిర్మించిన ఇతర భవనాలపైనా అధికారులు దృష్టి సారించడంతో మరిన్ని అక్రమ నిర్మాణాల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



## గచ్చిబౌలి భవనం కూల్చివేతలో అధికారులపై వేటు

- బిల్డర్ అక్రమాలకు అండగా నిలిచిన అధికారులపై చర్యలు
- టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్‌కుమార్ సస్పెన్షన్
- మరికొందరు అధికారులపై చర్యలకు రంగం సిద్ధం

**హైదరాబాద్, ఆగస్టు 23:**

గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం కూలిన ఘటనలో అధికారుల నిర్లక్ష్యం, బిల్డర్ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవడంలో విఫలమైన మాదాపూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారి (ఏసీపీ) సంతోష్‌కుమార్‌ను కమిషనర్ సృజన సస్పెండ్ చేశారు. అక్రమ నిర్మాణాల విషయంలో ఆయన ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించినట్లు విచారణలో తేలిందని అధికారులు తెలిపారు.

**ఇద్దరు కూలీల మృతి**

శనివారం జరిగిన భవనం కూలిన ఘటనలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు టైల్స్ కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

**అధికారుల పాత్రపై దర్యాప్తు**

సాజిద్ అక్రమ నిర్మాణాలకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న టౌన్ ప్లానింగ్, మున్సిపల్ అధికారుల పాత్రపైనా ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదనే కోణంలో విచారణ సాగుతోంది. దర్యాప్తులో బాధ్యతారాహిత్యం నిర్ధారణ అయితే మరికొందరు అధికారులపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## లిక్కర్ రవాణా కేసులో కారుమూరి అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 23:**

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ రవాణా కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, వైసీపీ నేత కారుమూరి నాగేశ్వరరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆదివారం అరెస్ట్ చేసింది. హైదరాబాద్ కొండాపూర్‌లోని ఆయన నివాసం నుంచి మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్న అధికారులు, తదుపరి విచారణ కోసం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి తరలించారు. మద్యం రవాణా టెండర్లలో అవకతవకలు, సబ్ కాంట్రాక్టుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని మళ్లించారన్న ఆరోపణలపై ఈడీ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తోంది.

**రూ.15 కోట్ల లావాదేవీలపై ఆరా**

మద్యం రవాణా సిండికేట్‌తో సంబంధం ఉన్న వ్యక్తుల నుంచి కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు కారుమూరి సునీల్ కుమార్ నగదు, బ్యాంకు లావాదేవీల రూపంలో సుమారు రూ.15 కోట్లు అందుకున్నట్లు ఈడీ ఆరోపిస్తోంది. సబ్ కాంట్రాక్టులు ఇప్పించేందుకు నాగేశ్వరరావు తన పలుకుబడిని ఉపయోగించుకున్నట్లు దర్యాప్తు సంస్థ పేర్కొంది.

**టెండర్ నిబంధనల్లో అక్రమాల ఆరోపణలు**

ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఒక నిర్దిష్ట సిండికేట్‌కు ప్రయోజనం చేకూరేలా మద్యం రవాణా విధానంలో మార్పులు చేశారని ఈడీ ఆరోపించింది. సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్స్ వంటి సంస్థలకు అనుకూలంగా టెండర్ నిబంధనలు రూపొందించినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు తెలిపింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రవాణా కాంట్రాక్టుల అవకతవకలపై విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఏపీ సీఐడీ నమోదు చేసిన కేసును ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద చేపట్టింది.

**ముందస్తు బెయిల్ పిటిషన్లు తిరస్కరణ**

అరెస్టు నుంచి రక్షణ కోరుతూ కారుమూరి నాగేశ్వరరావు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు జూలై 3న కొట్టివేసింది.




# నిజ్జర్ హత్యపై గోల్డీ బ్రార్ సంచలన ఆడియో!

- తామే హత్య చేశామని చెప్పినట్లు లీకైన టేప్
- పమ్మాతో సంభాషణలో కారణాలు వెల్లడించినట్లు సమాచారం
- డ్రగ్స్ కోసం యువకులను వినియోగించేవాడని ఆరోపణ
- బ్లాక్‌మెయిల్, ఇన్‌ఫార్మర్లుగా మార్చేవాడని వ్యాఖ్యలు
- అక్రమ ఆయుధాల వ్యాపారంపైనా ఆరోపణలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. నిజ్జర్‌ను తామే హత్య చేశామని గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ చెప్పినట్లు వెల్లడించే ఆడియో టేప్ ఒకటి వెలుగులోకి వచ్చినట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. యూకేకు చెందిన ఖలిస్తానీ ఉగ్రవాది పరమ్‌జిత్ సింగ్ పమ్మాతో జరిగిన సంభాషణలో బ్రార్ ఈ హత్యకు సంబంధించిన కారణాలను వెల్లడించినట్లు సమాచారం.

**డ్రగ్స్ వ్యవహారంలో నిజ్జర్ పాత్ర?**

లీకైన ఆడియోలో బ్రార్ చేసినట్లు చెబుతున్న ఆరోపణలు సంచలనంగా మారాయి. డ్రగ్స్ విక్రయాలకు 16-17 ఏళ్ల యువకులను వినియోగించేందుకు నిజ్జర్ మద్దతు ఇచ్చేవాడని ఆయన ఆరోపించినట్లు తెలుస్తోంది. డ్రగ్స్ విక్రయించేలా యువకులను బ్లాక్‌మెయిల్ చేసేవాడని, కొందరిని ఇన్‌ఫార్మర్లుగా ఉపయోగించుకునేవాడని బ్రార్ పేర్కొన్నట్లు సమాచారం.

**అక్రమ ఆయుధాల వ్యాపారంపైనా ఆరోపణలు**

నిజ్జర్ అక్రమ ఆయుధాల వ్యాపారంలోనూ పాల్గొనేవాడని బ్రార్ ఆరోపించినట్లు తెలుస్తోంది. డ్రగ్స్, ఆయుధాల వ్యవహారాలతో పాటు యువకులను వినియోగించే తీరుపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని, ఈ కారణాలతోనే అతడిని హత్య చేసినట్లు బ్రార్ చెప్పినట్లు ఆడియోలో ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

**భారత్–కెనడా మధ్య దౌత్య వివాదం**

2023లో కెనడాలోని సర్రే ప్రాంతంలో గురుద్వారా సమీపంలో నిజ్జర్ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన భారత్-కెనడా దేశాల మధ్య తీవ్ర దౌత్య వివాదానికి దారితీసింది. నిజ్జర్ హత్యలో భారత ప్రభుత్వ ఏజెంట్ల ప్రమేయం ఉందని అప్పటి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించగా, భారత్ ఆ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది.

**సంబంధాలు క్రమంగా మెరుగుదల**

వివాదం నేపథ్యంలో ఇరు దేశాలు తమ దౌత్య సిబ్బందిని తగ్గించుకోవడంతో సంబంధాలు మరింత దిగజారాయి. అయితే కెనడా ప్రధానిగా మార్క్ కార్నీ బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్-కెనడా సంబంధాల్లో క్రమంగా సానుకూల మార్పులు కనిపించాయి. ఈ నేపథ్యంలో నిజ్జర్ హత్యపై గోల్డీ బ్రార్‌కు ఆపాదిస్తున్న తాజా ఆడియో టేప్ వెలుగులోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.



# పోలీసులపై కారం పొడి.. కర్రలు, ఇటుకలతో దాడి

- వాహన తనిఖీల సమయంలో ఘటన
- ముగ్గురు పోలీసులకు గాయాలు
- పోలీసుల కళ్లలో కారం పొడి చల్లిన గుంపు
- మైనర్ సహా నిందితుల కోసం గాలింపు
- ప్రధాన నిందితుడిపై ఇప్పటికే ఐదు కేసులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** దేశ రాజధాని ఢిల్లీలో విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ఓ గుంపు దాడికి పాల్పడింది. భల్స్వా డైరీ ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులపై కారం పొడి చల్లి, కర్రలు, ఇటుకలతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు పోలీసు సిబ్బంది గాయపడగా, ఘటనకు సంబంధించిన వీడియో వెలుగులోకి రావడంతో తీవ్ర చర్చకు దారితీసింది.

**వాహన తనిఖీల సమయంలో..**

శనివారం మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో పోలీసులు భల్స్వా డైరీ ప్రాంతంలో సాధారణ గస్తీ నిర్వహిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా ఓ వాహనాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా, వాహన యజమానితో పాటు మరికొందరు వ్యక్తులు పోలీసులను అడ్డుకున్నట్లు అధికారులు తెలిపారు.

**కారం పొడి చల్లి దాడి**

పోలీసులను అడ్డుకున్న గుంపు ముందుగా వారి కళ్లలో కారం పొడి చల్లినట్లు సమాచారం. అనంతరం కర్రలు, ఇటుకలతో దాడికి దిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు పోలీసు సిబ్బంది గాయపడ్డారు. దాడిలో సునీల్ అలియాస్ పంకజ్ ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అతడిపై గతంలోనే ఐదు కేసులు నమోదైనట్లు తెలిపారు.

**మైనర్ అదుపులోకి**

ఘటన అనంతరం పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. దాడిలో పాల్గొన్న ఓ మైనర్‌ను సంఘటనా స్థలంలోనే అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఘటనకు సంబంధించిన వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు.

**కారణాలపై ఆరా**

పోలీసులపై దాడికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు కొనసాగుతోంది. వాహనాన్ని ఎందుకు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు? దాడిలో ఎంతమంది పాల్గొన్నారు? అనే అంశాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని అధికారులు తెలిపారు.

## చైనాకు అజిత్ దోవల్..

# సరిహద్దుపై కీలక చర్చలు

- వాంగ్ యీతో 25వ విడత ప్రత్యేక ప్రతినిధుల భేటీ
- భారత్–చైనా సరిహద్దు వివాదమే ప్రధాన అజెండా
- ద్వైపాక్షిక సంబంధాలపైనా చర్చించే అవకాశం
- బ్రిక్స్ సదస్సుకు ముందు కీలక సమావేశం
- సరిహద్దులో శాంతి, స్థిరత్వం అవసరమన్న జైశంకర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** భారత్-చైనా సరిహద్దు వివాదానికి పరిష్కారం కనుగొనే దిశగా మరో కీలక దౌత్య ప్రయత్నం ప్రారంభం కానుంది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సోమవారం చైనాలో పర్యటించి, ఆ దేశ విదేశాంగ మంత్రి వాంగ్ యీతో భేటీ కానున్నారు. మంగళవారం జరగనున్న ఈ సమావేశంలో ఇరు దేశాల ప్రత్యేక ప్రతినిధులు 25వ విడత చర్చల్లో పాల్గొంటారు. దాదాపు 2,488 కిలోమీటర్ల పొడవైన సరిహద్దుకు సంబంధించిన వివాదంతో పాటు ద్వైపాక్షిక సంబంధాలపై పలు అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.

**2003లో ప్రారంభమైన చర్చలు**

భారత్-చైనా సరిహద్దు సమస్యకు పరిష్కారం కనుగొనే లక్ష్యంతో ప్రత్యేక ప్రతినిధుల స్థాయి చర్చల ప్రక్రియ 2003లో ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇరు దేశాల ప్రతినిధులు పలు విడతల్లో చర్చలు జరుపుతున్నారు. తాజా సమావేశంలో సరిహద్దుల్లో పరిస్థితి, శాంతి, స్థిరత్వం, ఇరు దేశాల మధ్య సంబంధాల పురోగతిపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది.

**బ్రిక్స్ సదస్సుకు ముందు భేటీ**

సెప్టెంబర్‌లో న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనున్న నేపథ్యంలో దోవల్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ సమావేశానికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. ఆయన భారత్‌కు వస్తే ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యే అవకాశముంది. ఇరు దేశాల సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లే అంశాలపై ఇరువురు నేతలు చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**సరిహద్దులో శాంతి అవసరం**

దోవల్ పర్యటనకు ముందు విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. చైనాతో సత్సంబంధాలు కొనసాగాలంటే సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వం తప్పనిసరిగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌లోని అప్పర్ సుబన్‌సిరి ప్రాంతంలోకి చైనా సైనికులు చొరబడ్డారనే నివేదికల నేపథ్యంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

**సంబంధాలపై కీలక దృష్టి**

సరిహద్దు వివాదంతో పాటు వాణిజ్యం, ద్వైపాక్షిక సంబంధాలు, పరస్పర సహకారం వంటి అంశాలు కూడా తాజా చర్చల్లో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. ఈ సమావేశం అనంతరం భారత్-చైనా సంబంధాలపై తదుపరి దిశ స్పష్టమయ్యే అవకాశముంది.

# బిట్స్ పిలానీ నుంచి రికార్డు స్థాయిలో పట్టాలు

- 15,153 మంది ఉద్యోగ నిపుణులకు డిగ్రీలు
- గతేడాదితో పోలిస్తే దాదాపు రెట్టింపు
- 30 విభాగాల్లో విద్య పూర్తి చేసిన అభ్యాసకులు
- 2,000 మందికిపైగా మహిళా నిపుణులు
- 15 దేశాలకు చెందిన అంతర్జాతీయ అభ్యాసకులు

**హైదరాబాద్:** బిట్స్ పిలానీ వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్ (డబ్ల్యూఐఎల్‌పీ) స్నాతకోత్సవం2026లో రికార్డు స్థాయిలో 15,153 మంది ఉద్యోగ నిపుణులు డిగ్రీలు అందుకున్నారు. 30 ప్రత్యేక విభాగాల్లో విద్యను పూర్తి చేసిన వారికి పట్టాలు ప్రదానం చేశారు. గతేడాదితో పోలిస్తే ఈసారి పట్టభద్రుల సంఖ్య దాదాపు రెట్టింపు కావడం విశేషం.

**ఉద్యోగంతో పాటు ఉన్నత విద్య**

ఉద్యోగాల్లో కొనసాగుతూనే ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే నిపుణుల కోసం డబ్ల్యూఐఎల్‌పీని రూపొందించారు. తరగతి గది విద్యను పరిశ్రమ అవసరాలు, వాస్తవ ఉద్యోగ అనుభవాలతో అనుసంధానించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. దీంతో ఉద్యోగానికి అంతరాయం లేకుండా కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం లభిస్తుంది.

హైదరాబాద్‌లోని బిట్స్ పిలానీ ప్రాంగణంలో నిర్వహించిన స్నాతకోత్సవానికి డిక్సన్ టెక్నాలజీస్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అతుల్ బి. లాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బిట్స్ పిలానీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. రామ్‌గోపాల్ రావు, ఆఫ్‌క్యాంపస్ ప్రోగ్రామ్స్ అండ్ ఇండస్ట్రీ ఎంగేజ్‌మెంట్ డైరెక్టర్‌ఇన్‌ఛార్జ్ ప్రొఫెసర్ ఎస్. గురునారాయణన్ తదితరులు పాల్గొన్నారు.

**విభిన్న రంగాల నుంచి**

ఈ బ్యాచ్‌లో 46 శాతం మంది సాంకేతిక, డిజిటల్ రంగాలకు చెందినవారు కాగా, 35 శాతం మంది ఇంజనీరింగ్, తయారీ, మౌలిక సదుపాయాల రంగాల్లో పనిచేస్తున్నారు. 2,000 మందికిపైగా మహిళా నిపుణులు, 167 మంది వైద్యులు, 60 మంది రక్షణ సిబ్బంది కూడా పట్టాలు పొందారు. 15 దేశాలకు చెందిన 80 మందికిపైగా అంతర్జాతీయ అభ్యాసకులు ఈ బ్యాచ్‌లో ఉండటం కార్యక్రమం విస్తృతిని చాటింది.

**నిరంతర విద్యకు ప్రాధాన్యం**

బిట్స్ పిలానీ ఛాన్సలర్ కుమార్ మంగళం బిర్లా మాట్లాడుతూ.. ఉద్యోగం, విద్య మధ్య ఉన్న సాంప్రదాయ విభజన తగ్గాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగంలో కొనసాగుతూనే విద్యా సామర్థ్యాలను పెంచుకోవడం వ్యక్తులతో పాటు దేశ ఉత్పాదకతకు ప్రయోజనం చేకూరుస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం డబ్ల్యూఐఎల్‌పీలో 51 వేల మందికిపైగా అభ్యాసకులు నమోదు చేసుకున్నారని, 32 దేశాల్లో 1.5 లక్షలకుపైగా పూర్వ విద్యార్థులతో విస్తృత నెట్‌వర్క్ ఉందని తెలిపారు. వేగంగా మారుతున్న సాంకేతిక రంగంలో ఉద్యోగులు నిరంతరం కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందని అతుల్ బి. లాల్ అన్నారు. హైటెక్ తయారీ, ఎలక్ట్రానిక్స్ రూపకల్పన, డిజిటల్ మౌలిక సదుపాయాల్లో నైపుణ్యం కలిగిన ప్రతిభకు డిమాండ్ పెరుగుతోందన్నారు.

# పార్లమెంట్ ప్రొరోగేషన్‌పై ఉత్కంఠ

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** పార్లమెంట్ ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడి పది రోజులు దాటినా వర్షాకాల సమావేశాలను కేంద్ర ప్రభుత్వం ఇంకా అధికారికంగా ముగించలేదు. లోక్‌సభ, రాజ్యసభలను నిరవధికంగా వాయిదా వేసినప్పటికీ ప్రొరోగేషన్ ఉత్తర్వులు వెలువడకపోవడంతో కేంద్రం తదుపరి వ్యూహంపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. రాష్ట్రపతి నుంచి ప్రొరోగేషన్ ఉత్తర్వులు రాకపోవడం వెనుక కారణమేంటన్న దానిపై ఆసక్తి నెలకొంది.

**వాయిదా.. ప్రొరోగేషన్ వేర్వేరు**

పార్లమెంట్ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేయడాన్ని అడ్జర్న్‌మెంట్ సైన్ డై అంటారు. అయితే రాష్ట్రపతి అధికారికంగా సమావేశాలను ముగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినప్పుడే ప్రొరోగేషన్ పూర్తవుతుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వ సిఫార్సుతో రాష్ట్రపతి పార్లమెంట్ సమావేశాలను పిలవడం, ముగించడం జరుగుతుంది. సాధారణంగా ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడిన కొద్ది రోజుల్లోనే ప్రొరోగేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈసారి మాత్రం పది రోజులు గడిచినా ఉత్తర్వులు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**మహిళా రిజర్వేషన్‌పై చర్చ**

ప్రొరోగేషన్ జాప్యానికి అధికారిక కారణం వెల్లడికాకపోయినా మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు అవసరమైన సవరణను కేంద్రం తీసుకురావచ్చనే ప్రచారం జరుగుతోంది. అయితే జనగణన, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చేలా ప్రస్తుత నిబంధనలు ఉన్నాయి. దీంతో డీలిమిటేషన్ అంశం కీలకంగా మారింది.

**దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలు**

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సమస్యకు పరిష్కారంగా మొత్తం లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ప్రత్యామ్నాయ మార్గంపై కేంద్రం కసరత్తు చేస్తోందన్న చర్చ సాగుతోంది. ప్రస్తుత ప్రాతినిధ్యం దెబ్బతినకుండా సీట్ల సంఖ్యను పెంచే ప్రతిపాదనపై పరిశీలన జరుగుతున్నట్లు సమాచారం.

**ప్రత్యేక సమావేశంపై ఊహాగానాలు**

స్వాతంత్ర్యదినోత్సవం తర్వాత రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొచ్చేందుకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందన్న ప్రచారం గతంలోనే జరిగింది. ప్రొరోగేషన్ ఆలస్యం కావడంతో ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరింది. అయితే ప్రత్యేక సమావేశాలపై కేంద్రం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కీలక బిల్లుకు అవసరమైన సంఖ్యాబలాన్ని సమీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయా అన్న చర్చ మాత్రం కొనసాగుతోంది.

**కాంగ్రెస్ ప్రశ్నలు**

ప్రొరోగేషన్ ఉత్తర్వులు ఎందుకు జారీ చేయలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. సాధారణంగా లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడిన కొద్ది రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తవుతుందని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌తో ముడిపడిన రాజ్యాంగ సవరణను ప్రత్యేక సమావేశంలో ఆమోదించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మూడింట రెండొంతుల మెజార్టీ కోసం ప్రయత్నిస్తున్నారా అని ప్రశ్నించారు.

# మళ్లీ సిద్ధమైన జైషే ఉగ్ర స్థావరం!

- ఆపరేషన్ సిందూర్‌లో దెబ్బ..
- 15 నెలల తర్వాత పునర్నిర్మాణం
- పాక్ ప్రభుత్వమే నిధులిచ్చినట్లు సమాచారం
- బహావల్పూర్‌లోని మార్కజ్ సుభాన్ అల్లా పునర్నిర్మాణం
- గతేడాది మే 7న భారత్ దాడులతో ధ్వంసం
- రూ.25 కోట్ల పాక్ రూపాయల నిధులపై అనుమానాలు
- ప్రధాన హాల్ పునర్నిర్మాణానికి రూ.11 కోట్లు?
- మద్రసా, కమాండర్ల నివాసాల వద్దా పనులు




**బహావల్పూర్, ఆగస్టు 23:** ఆపరేషన్ సిందూర్‌లో భారత దాడులతో ధ్వంసమైన జైషే మహ్మద్ ప్రధాన స్థావరం మళ్లీ సిద్ధమవుతున్నట్లు సమాచారం. పాకిస్థాన్‌లోని బహావల్పూర్‌లో ఉన్న మార్కజ్ సుభాన్ అల్లా కాంప్లెక్స్‌లో దెబ్బతిన్న భవనాలకు కొత్త మార్బుల్, ప్లాస్టర్, పెయింట్ వేస్తూ పునర్నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్మాణాలకు పాకిస్థాన్ ప్రభుత్వం సుమారు రూ.25 కోట్ల పాక్ రూపాయలు అందించినట్లు సమాచారం.

**ఆపరేషన్ సిందూర్‌లో కీలక దెబ్బ**

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 2025 మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పీఓకే, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలు, శిక్షణ కేంద్రాలు, కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించింది. ఇందులో బహావల్పూర్‌లోని జైషే మహ్మద్ మార్కజ్ సుభాన్ అల్లా ప్రధాన కార్యాలయం కూడా తీవ్రంగా దెబ్బతింది. ఈ దాడుల్లో జైషే అధినేత మసూద్ అజార్ బంధువులు మరణించినట్లు సమాచారం.

**భారీగా పునర్నిర్మాణ పనులు**

భారత దాడుల్లో దెబ్బతిన్న ప్రధాన హాల్‌కు సుమారు రూ.11 కోట్ల పాక్ రూపాయలు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. భవనంపై ఉన్న గోపురాలను తిరిగి నిర్మించడంతో పాటు గోడలకు కొత్త ప్లాస్టర్, పెయింట్, మార్బుల్ పనులు చేపట్టారు. దాడుల ఆనవాళ్లు కనిపించకుండా కాంప్లెక్స్‌ను పూర్తిగా పునరుద్ధరిస్తున్నట్లు సమాచారం.

**మద్రసా, నివాస ప్రాంతాల్లోనూ పనులు**

ప్రధాన కార్యాలయానికి ఆనుకుని ఉన్న మద్రసా అల్ సబీర్, జైషే కమాండర్ల నివాస ప్రాంతాలు కూడా దాడుల్లో దెబ్బతిన్నాయి. ఆయా ప్రాంతాల్లోనూ కొత్త నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో జైషే మహ్మద్ కార్యకలాపాలకు ఉపయోగించే కీలక మౌలిక వసతులను తిరిగి ఏర్పాటు చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**18 ఎకరాల్లో విస్తరించిన స్థావరం**

మార్కజ్ సుభాన్ అల్లా అంతర్జాతీయ సరిహద్దుకు సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. 18 ఎకరాల్లో విస్తరించిన ఈ కాంప్లెక్స్‌ను ఉస్మాన్‌ఓఅలీ క్యాంపస్ అని కూడా పిలుస్తారు. ఇందులో మసీదుతో పాటు జైషే మహ్మద్‌కు సంబంధించిన పలు నిర్మాణాలు ఉన్నాయి.

**నిషేధం ఉన్నా కొనసాగుతున్న కార్యకలాపాలు**

పాకిస్థాన్ ప్రభుత్వం 2002లో జైషే మహ్మద్‌పై నిషేధం విధించినప్పటికీ, ఆ సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 2001 పార్లమెంట్ దాడి, 2016 పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై దాడి, 2019 పుల్వామా ఉగ్రదాడుల్లో జైషే మహ్మద్ ప్రమేయం ఉన్నట్లు భారత్ పేర్కొంది. తాజాగా దాడులతో ధ్వంసమైన స్థావరాన్ని తిరిగి నిర్మిస్తున్నట్లు వస్తున్న సమాచారం.. పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలపై అనుసరిస్తున్న వైఖరిపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తుతోంది.

# సాగునీటి కోసం బీఆర్ఎస్ పోరు





- భక్త రామదాస్ కాలువను సందర్శించిన బిఆర్ఎస్ బృందం
- ఖమ్మం వరంగల్ జాతీయ రహదారి దిగ్బంధనం
- స్తంభించిన రాకపోకలు
- పాలేరు రిజర్వాయర్ నుంచి భక్త రామదాసు లిఫ్ట్ ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్

**ఖమ్మం రాజముద్ర న్యూస్..**

సాగునీటి కోసం రైతులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని ఆరోపిస్తూ బిఆర్ఎస్ పార్టీ తిరుమలాయపాలెం మండలంలో పోరుబాట పట్టింది. పాలేరు రిజర్వాయర్ నుంచి భక్త రామదాసు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తిరుమలాయపాలెం మండలంలోని ఆయకట్టుకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఖమ్మం వరంగల్ జాతీయ రహదారిపై బి ఆర్ ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో ధర్నా నిర్వహించారు. మండలం లో ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న రైతులు సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేయాల్సి రావడంతో ప్రతి ఏటా రైతులు అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెట్టుబడులు పెరుగుతున్నా నీటి వసతి లేకపోవడంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు భాషాబోయిన వీరన్న మాట్లాడుతూ.. తిరుమలాయపాలెం మండల రైతుల సాగునీటి సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాలేరు రిజర్వాయర్ గత ప్రభుత్వం తిరుమలాయపాలెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి భక్త రామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా తిరుమలాయపాలెం మండలానికి సాగునీరు,తాగునీరు అందించేందుకు వేలకోట్ల రూపాయలు ఖర్చుపెట్టి లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మించి మహ్మదాపురం వద్ద ఎస్ఆర్ఎస్పీ కాలువలకి పైపులైన్ ద్వారా నిర్మాణం చేపట్టింది కానీ ఇప్పుడు వర్షాభావం పరిస్థితులు ఏర్పడడంతో కనీసం ఆరుతడి పంటలకు కూడా నీరు అందించే పరిస్థితి లేదని వ్యవసాయ అధికారులు ఇప్పటివరకు లిఫ్ట్ మోటార్లను ఆన్ చేయకపోవడం పై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలేరు రిజర్వాయర్లో ఎంతో కొంత నీరు అందుబాటులో ఉన్నప్పటికీ మండలంలోని రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందకపోవడం బాధాకరమన్నారు. భక్త రామదాసు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తిరుమలాయపాలెం మండలానికి సాగునీరు అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. రైతు పొలానికి నీరు చేరే వరకు మా పోరాటం ఆగదు. సాగునీరు రైతు హక్కు.. పాలేరు నీటితో తిరుమలాయపాలెం పంట పొలాలు పచ్చగా మారే వరకు ఉద్యమం కొనసాగిస్తాం" అని భాషాబోయిన వీరన్న పేర్కొన్నారు.

తిరుమలాయపాలెం మండల రైతుల సాగునీటి సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, పాలేరు రిజర్వాయర్-భక్త రామదాసు లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భాషబోయిన వీరన్న , మండల నాయకులు బిల్లగిరి ధనుంజయ , రెడ్డి మల్ల నరేందర్ కొవ్వూరి సందీప్ రెడ్డి మాజీ సర్పంచ్ బోడ మంచా నాయక్ సర్పంచ్ లు ఆర్మీ రవి బోడ మంజు రవి మాజీ సర్పంచ్ ఆలస్యం నాగేశ్వరరావు వంచర్ల సత్యనారాయణ రెడ్డి తీగల మేఘనాధ రావు మండల మైనార్టీ అధ్యక్షులు, గోల్ తండా ఉపసర్పంచ్ షేక్ చందు ,, మాజీ ఎంపీటీసీ ధరావత్ శంకర్ నాయక్ , బీరోలు వంచర్ల సత్యనారాయణ రెడ్డి భాష బోయిన తనై ప్రకాష్ కీసర సంకీర్తన రెడ్డి వశ పొంగు మల్లయ్య ఇస్లావత్ బావ్ సింగ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు

20 వేల కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉంటే

# 7 వేలకే నోటిఫికేషనా?



- 20 వేల కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉంటే 7 వేలకే నోటిఫికేషనా?
- ఖాళీ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలి
- ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్

**ఖమ్మం రాజముద్ర న్యూస్..**

రాష్ట్రంలో సుమారు 20 వేల కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్ అన్నారు. ఖాళీగా ఉన్న అన్ని కానిస్టేబుల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రము లోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. వేలాది మంది యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో భర్తీ చేయకుండా పరిమిత సంఖ్యలో పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్లు ఇవ్వడం వల్ల నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు.

ప్రతి సంవత్సరం సుమారు 9 వేల మంది ఉద్యోగ విరమణ పొందుతున్నప్పటికీ, ఆ స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టడం లేదని విమర్శించారు. ఖాళీ పోస్టులన్నింటినీ గుర్తించి, ఒకేసారి నియామక ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం యువత లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటూ, నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల నిరుద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని ఆయన విమర్శించారు. కేంద్రంలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీ అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. యువత, నిరుద్యోగుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి పాలపాటి అశోక్, కోశాధికారి బాలిన కృష్ణంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మూడు శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎస్ అంతం మన పంతం



- టిఎస్ సిపిఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్
- చలో హైదరాబాద్ కు భారీగా తరలిన ఉద్యోగులు

**ఖమ్మం రాజముద్ర న్యూస్**

సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర సిపిఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ లో తలపెట్టిన జన జాగరణ యాత్ర బహిరంగ సభకు ఆదివారం ఖమ్మం జిల్లా నుండి జిల్లా అధ్యక్షులు చంద్రకంటి శశిధర్ ఆధ్వర్యంలో సుమారు 1500 మంది ఉద్యోగులు హైదరాబాద్ కు తరలి వెళ్ళారు.వివిధ మార్గాల ద్వారా బయలుదేరి వెళ్ళిన ఉద్యోగులను ఉద్దేశించి శశిధర్ మాట్లాడుతూ జన జాగరణ యాత్ర బహిరంగ సభతో ప్రభుత్వం దిగివచ్చి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సిపిఎస్ ని రద్దు చేసి పాత పెన్షన్ ని పునరుద్ధరింప చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సిపిఎస్ అంతం మన పంతం అంటూ ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభకు బయల్దేరారు.ఈ కార్యక్రమంలో సిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా బాధ్యులు బంగారయ్య,లక్ష్మణాచారి, భాను, మోహన్,స్వప్న,రాణి,కృష్ణవేణి,సురేష్,రాము, నాగమణి,శ్వేత,ప్రభాకర్,ధనరాజ్,నరసింహారావు,క్రాంతి, కె.శ్రీనివాసరావు,రాజు,వివిధ మండలాల ఉద్యోగులు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



శంకర్ పల్లిలో ఘనంగా పోచమ్మ దేవి

# విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం...

- పాల్గొన్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:**

శంకర్ పల్లి మునిసిపల్ పరిధిలోని హైదరాబాద్ రోడ్, బిడిఎల్ చౌరస్తా వద్ద పోచమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. పోచమ్మ దేవి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మునిసిపల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చంద్ర మౌళి, మునిసిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్ పర్సన్ జూలకంటి శ్వేతా పాండు రంగారెడ్డి, కౌన్సిలర్లు గణేష్, ఆనంద్, అశోక్, డిసిసి వైస్ ప్రెసిడెంట్ చేకూర్తి గోపాల్ రెడ్డి, పిల్లిగుండ్ల గ్రామ సర్పంచ్ స్వాతి కాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ప్రశాంత్, భాస్కర్ రెడ్డి, నాయకులు రఘునందన్ రెడ్డి, శ్రీకాంత్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు

# బోనమెత్తిన పల్లెలు...



- అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ తల్లి జాతర

**ఖమ్మం రాజముద్ర న్యూస్**

: నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగ సందడి నెలకొంది. గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ తల్లి జాతరను భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, కోలాటం, నృత్యాలతో గ్రామ వీధులు మార్మోగాయి. మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకుని భారీ ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలు గ్రామాల్లో కుటుంబ సభ్యులు, బంధువుల రాకతో పల్లెలు కళకళలాడాయి. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.కొత్తకోటూరు గ్రామంలో బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ స్మార్ట్ సిటీగా నల్గొండ

- మౌలిక వసతుల అభివృద్ధికి భారీ ప్రణాళికలు
- 24 గంటల తాగునీటి సరఫరాకు చర్యలు
- ఎస్ఎల్‌బీసీ పనుల వేగవంతంపై దృష్టి
- నగరాభివృద్ధికి వేల కోట్ల పెట్టుబడులు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**నల్గొండ, ఆగస్టు 23 :**

నల్గొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి కోసం భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులను అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం నల్గొండ క్లబ్‌లో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన అదనపు గదులు, సమావేశ మందిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నల్గొండ పట్టణ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు రూ.125 కోట్ల అంచనా వ్యయంతో ప్రత్యేక పనులు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. వచ్చే ఆరు నెలల్లో ఈ పనులను పూర్తి చేసి పట్టణానికి 24 గంటల తాగునీటి సరఫరా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తి చేయడం ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యాల్లో ఒకటని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అవసరమైన నిధులను సమీకరించి, సాగునీటి శాఖ సహకారంతో పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. 2028 ఆగస్టు నాటికి ఎస్ఎల్‌బీసీ పనులను పూర్తిచేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రాజెక్టు వ్యయం రూ.2,000 కోట్ల నుంచి రూ.5,000 కోట్లకు పెరిగినప్పటికీ పనుల్లో గణనీయమైన పురోగతి సాధించామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. నల్గొండ పట్టణ అభివృద్ధిలో భాగంగా రూ.900 కోట్ల వ్యయంతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం కొనసాగుతోందని మంత్రి పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతో పాటు నగరాన్ని ఆధునికంగా తీర్చిదిద్దేందుకు రహదారి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రస్తుతం దాదాపు రూ.1,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని వివరించారు. అదనంగా రూ.300 కోట్ల వ్యయంతో భూగర్భ మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డబుల్ రోడ్ల నిర్మాణం చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. సమగ్ర ప్రణాళికతో నల్గొండను ఆధునిక, సుందర, సౌకర్యవంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు



# యువత జాబ్ మేళాను వినియోగించుకోవాలి

- యూత్ ప్రెసిడెంట్ రంజిత్

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**

రామారెడ్డి మండల యువత ఎల్లారెడ్డి క్యాంప్ కార్యాలయంలో మదన్మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే మెగా జాబ్ మేళాకు యువతీ, యువకులు పెద్ద ఎత్తున హాజరై ఉద్యోగాలు పొంది ప్రయోజకులు కావాలని మండల యూత్ అధ్యక్షుడు రంజిత్ ఉన్నారు. ఈ జాబ్ మేళాకు 70 కంపెనీలు, 5000 వేల ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు.



# కడప కారం దోశ.. బొంబాయి చట్నీ.. ఇంట్లోనే తయారుచేసుకోండిలా..!

కడప కారం దోశ.. బొంబాయి చట్నీ ఈ రెండు ఎంతో ఫేమస్. వీటి కాంబినేషన్ ఇంకా ఫేమస్. వీటిని తినాలంటే ఎక్కడెక్కడికో పరిగెత్తాల్సి వస్తుంది. కానీ ఆ అవసరం లేకుండా ఇప్పుడు ఇంట్లోనే కడప కారం దోశ.. బొంబాయి చట్నీ తయారు చేసుకోవచ్చు. అది ఎలాగో ఈ కథనంలో తెలుసుకుందాం.. ఒంగోలు, నెల్లూరు, కడప జిల్లాల్లో కారం దోశల టేస్ట్ చాలా బాగుంటుంది. అయితే కడప కారం దోశలో ఏదో తెలియని అద్భుతమే ఉంటుంది. కడప కారం దోశ అంత టేస్ట్ మిగతా ఏ దోశకి రాదనే చెప్పొచ్చు. ఎవరైనా కడప మీదుగా వెళ్తుంటే ఆగి ఒక కారం దోశ తప్పక తినాల్సిందే. కడప జిల్లాలోని పొద్దుటూరు, మైదుకూరు ప్రాంతాల్లో కూడా దీని టేస్ట్ బాగుంటది. ఒక్కసారి కడప కారం దోశ తిన్నారు అంటే ఇక అది మీ ఫేవరెట్ లిస్ట్ లో చేరిపోతుంది.కడప కారం దోశను టేస్టీ చట్నీతో తినాలంటే అదృష్టం ఉండాలి ఎవరికైనా. అయితే ఆ అదృష్టం మీకు కావాలనుకుంటే ఇంట్లోనే ఈజీగా కడప కారం దోశను ఎలా చేసుకోవాలో ఇక్కడ చూడండి.





**కడప కారం దోశ తయారీకి కావాల్సిన పదార్థాలు**

మినపగుళ్లు
దోశల బియ్యం
మెంతులు
జీలకర్ర
నూనె
నెయ్యి
పుట్నాలపప్పు
ఎండుమిర్చి
ఉల్లిపాయ
ఉప్పు
అల్లం
వెల్లుల్లి
కరివేపాకు
చింతపండు
శనగపిండి
శనగపప్పు
పచ్చిమిర్చి
పసుపు
కొత్తిమీర

**తయారీ విధానం**

మినపప్పు నాలుగు గంటలు ఓ బౌల్ లో నానబెట్టండి. నాలుగు గంటల తర్వాత అందులో 3 కప్పుల దోశల బియ్యం,ఓ టీస్పూన్ మెంతులు కలిపి వీటన్నింటిని తగినన్ని నీళ్లు పోసుకుంటూ ఎక్కువసేపు రుబ్బాలి. రోలు లేకుంటే మిక్సీలో వేసుకోండి. పిండి బాగా మృదువుగా అయిన తర్వాత దానిని ఓ బౌల్ లోకి తోడుకొని కనీసం 12 గంటలు నానబెట్టుకోండి. ఇప్పుడు కారం దోశల్లోకి కారం కోసం 2025 ఎండుమిర్చిని వేడినీళ్లల్లో 15 నిమిషాలు నానబెట్టాలి. మిరపకాయలు నానేలోగా పప్పుల పప్పుల పొడి చేసుకోండి. అందుకోసం మిక్సీ జార్ లో 7 వెల్లుల్లి రెబ్బలు,అరకప్పు పుట్నాల పప్పు వేసి దాన్ని పొడి చేసుకోండి. ఇప్పుడు కారం చట్నీ కోసం 15 నిమిషాలు నానిన ఎండుమిర్చి,రుచికి సరిపడా ఉప్పు,ఒక టీస్పూన్ జీలకర్ర,రెండు పచ్చి ఉల్లిపాయ ముక్కలు పెద్దవి మిక్సీలో వేసి తగినన్ని నీళ్లు పోసుకుంటూ మెత్తగా పేస్ట్ లా చేసుకోండి. 12 గంటల తర్వాత పొంగిన దోశ పిండిని వేరే బౌల్ లోకి కొంచెం తీసుకోండి. అందులో సరిపడా ఉప్పు,నీళ్లు పోసుకొని కలుపుకోండి. మామూలు దోశ పిండి కంటే కడప కారం దోశ కోసం పిండి కొంచెం మందంగా ఉంటే బాగుంటది. ఇప్పుడు స్టవ్ మీద పెనం పెట్టుకొని వేడి చేయండి. బాగా వేడెక్కాక పెనం మీద ఓ దోశ పిండి పోసి స్ప్రెడ్ చేసుకోండి. అంచుల వెంట ఓ టేబుల్ స్పూన్ నూనె పోసి కాలనివ్వండి. దోశ మధ్యలో కొంచెం ఎర్రబడ్డాక దాని మీద ఓ టీస్పూన్ నెయ్యి వేసి స్ప్రెడ్ చేయడండి. అయితే నెయ్యి అనేది మీకు ఇష్టం ఉంటే వేసుకోవచ్చు లేదంటే లేదు. ఇప్పుడు దోశ మీద ముందుగా రెడీ చేసి పెట్టుకున్న దోశ కారం వేసి బాగా స్ప్రెడ్ చేయండి. ఆ తర్వాత దానిపై ఓ టీ స్పూన్ పప్పుల పొడి చల్లండి. అంతే రుచికరమైన కడప కారం దోశ రెడీ. దీన్ని ముందే రెడీ చేసుకున్న బొంబాయి చట్నీతో తింటే టేస్ట్ అదిరిపోతుంది.



**బొంబాయ్ చట్నీ తయారీ విధానం**

బొంబాయ్ చట్నీ కోసం ముందుగా నిమ్మకాయ సైజు అంత నానబెట్టుకున్న చింతపండును ఓ బౌల్ లో వేసి బాగా పిసకండి. తొక్కంతా పడేసి పిసకగా వచ్చిన చింతపండు రసంలో 350 గ్రాముల నీళ్లు పోసుకోండి.

అందులోనే రెండున్నర టేబుల్ స్పూన్ల శనగపిండి,రుచికి సరిపడా కల్లు ఉప్పే వేసి చేత్తో బాగా పలుచగా అయ్యేలా కలుపుకోండి. ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి అందులో రెండు టీస్పూన్ల ఆయిల్ పోసి వేడి చేసుకోండి. అందులో అర టీస్పూన్ ఆవాలు,ఓ టీస్పూన్ మినపప్పు వేసి ఎర్రగా వచ్చేలా వేపుకోండి. ఆ తర్వాత అందులో రెండు ఎర్ర మిర్చి,అర టీస్పూన్ జీలకర్ర,రెండు రెబ్బల కరివేపాకు అందులో వేయండి. తాలింపు అంతా వేగాక అందులో ఓ సన్నగా తరిగిన పచ్చిమిర్చి,అర టీస్పూన్ అల్లం తరుగు,రెండు చిటికెళ్ల పసుపు వేసి వేపుకోండి. ఇప్పుడు చింతపండు శనగప్పుతో కలిపిపెట్టి ఉంచుకున్న నీళ్లు అందులో పోసి కలుపుతూ బాగా మరిగించాలి. 2 లేదా 3 నిమిషాలకు ఉడుకు వచ్చి రాగానే స్టవ్ ఆపేయండి. ఆ తర్వాత కాస్త కొత్తిమీర తరుగు అందులో వేసి కలుపుకొని దించేసుకోని ఒక నిమిషం తర్వాత కడప కారం దోశలో వేసుకొని తింటే టేస్ట్ అదిరిపోతుంది.

# జలుబు, దగ్గు చిటికెలో మాయం చేసే చిట్కా ఇదే..!



చలికాలంలో చాలా మంది దగ్గు, జలుబు, గొంతు నొప్పి, వైరల్ ఫీవర్‌తో బాధ పడుతుంటారు. అలాగే రోగ నిరోధక శక్తి కూడా చాలా వరకు తగ్గిపోతుంటుంది. వాటిని తగ్గించుకునేందుకు, వాటి నుంచి ఉపశమనం పొందేందుకు రకరకాలా ట్యాబెట్లు వినియోగిస్తుంటారు.

అయితే శీతాకాలంలో వచ్చే ఈ సమస్యలను తగ్గించేందుకు, వాటి నుంచి ఉపశమనం పొందేందుకు వాము ఎంతగానో ఉపయోగపడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇది మార్కెట్‌లో కేవలం 2 రూపాయలకు కూడా దొరికేస్తూ ఉంటుంది. వామును సాధారణంగా ఆహారాన్ని సిద్ధం చేసే క్రమంలో వినియోగిస్తుంటాము. ఇవి జీర్ణ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తుంది. కానీ జలుబు, దగ్గు, గొంతు నొప్పి సమస్యలను కూడా పరిష్కరిస్తుందని చాలా మందికి తెలియదు. వామును తీసుకుంటే ఏ విధమైన ప్రయోజనాలు ఉంటాయి?, ఏ విధంగా వాము తీసుకోవాలి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**వాము జలుబు, దగ్గును ఏ విధంగా తొలగిస్తుందంటే?**

వాములో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి గొంతులో వాపును తగ్గిస్తుంది. అలాగే గొంతులో గరగరకు కారణమయ్యే వాటిని కూడా పరిష్కరిస్తుంది. తద్వారా దగ్గు అనేది తగ్గిపోతుంది. వాము అనేది ఒక ఎక్స్‌పెక్టోరెంట్. ఇది చాతిలోనే కఫాన్ని తొలగించడానికి చాలా సహాయపడుతుంది. వాములు తీసుకోవడం వల్ల దగ్గుతో పాటు కఫము కూడా తగ్గిపోతుంది.

**బ్యాక్టీరియాల నాశనం కోసం..**

వాములో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి శరీరంలో జలుబుకు కారణమయ్యే బ్యాక్టీరియాను చంపుతుంది. దీని ద్వారా జలుబు తగ్గిస్తుంది. అలాగే వాములో రోగ నిరోధక శక్తిని పెంచే గుణాలు కూడా ఉన్నాయి. వాము తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి జలుబుకు కారణమయ్యే బ్యాక్టీరియాపై పోరాడేందుకు కావాల్సిన శక్తి లభిస్తుంది.

**వామును ఎలా ఉపయోగించాలంటే?**

వామును వివిధ పద్ధతుల్లో వినియోగించుకోవచ్చు. వాము నీరు తాగడం, వంటల్లో వేసుకోవడం, పొడిగా చేసి తినడం, నెయ్యితో కలిపి కూడా తీసుకోవచ్చు. వివిధ మార్గాల్లో వామును తీసుకోవడం వల్ల ప్రయోజనాలు సమానంగా ఉంటాయి. ఒక గ్లాస్ నీటిలో ఒక స్పూన్ వాము వేసుకొని, ఆ నీటిని మరిగించి తాగడం వల్ల జీర్ణ సమస్యలు, కడుపు ఉబ్బరం, తేన్పులు వంటి సమస్యలు దూరమవుతాయి. అలాగే వామును వంటల్లో జత చేసుకోవడం వల్ల ఆ వంటలకు ప్రత్యేకమైన రుచి వస్తుంది. దీంతో పాటు ఆరోగ్యానికి కూడా ఎంతగానో మేలు జరుగుతుంది. వామును పొడిగా చేసి, నల్ల ఉప్పుతో కలిపి తీసుకోవడం వల్ల కడుపునొప్పి తగ్గిపోతుంది. వాముపొడిని నెయ్యితో కలిపి తీసుకోవడం నెలసరి సమయంలో వచ్చే సమస్యలన్నీ దూరమవుతాయి. అలాగే వాములో నుంచి తీసిన నూనెను చెవిలో చుక్కలుగా కూడా ఉపయోగించుకొవచ్చు.

**ఎంత తీసుకోవాలి?**

వాముతో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ పరిమితంగా ఆ వామును తీసుకోవాల్సి ఉంటుంది. వామును అధికంగా తీసుకోవడం వల్ల కడుపునొప్పి వచ్చే ప్రమాదం ఉంది. కొంతమంది వాము అలర్జీ ఉంటుంది. అందుకే దీనిని తీసుకునే ముందు సంబంధిత వైద్యులను లేదా నిపుణుల సలహాలు తీసుకుంటే మంచిది. ఆరోగ్య సమస్య మరీ ఎక్కువగా ఉంటే కచ్చితంగా వైద్యులను సంప్రదించాలి.



# చికెన్ లో ఈ పార్ట్ వెరీ డేంజర్

చాలా మందికి నాన్‌వెజ్ అంటే చాలా ఇష్టం. అసలు ముక్క లేనిదే ముద్ద దిగని వారు కూడా ఉంటారు. మాంసాహారంలో ఎక్కువగా ఇష్టంగా తినేది చికెన్. ఇది కూడా కొంచెం తక్కువ ధరలో దొరుకుతుంది కాబట్టి అందరూ చికెన్ తినడానికి ఇష్ట పడుతుంటారు. అయితే అధిక మొత్తంలో చికెన్ తినడం కూడా ఆరోగ్యానికి ప్రమాదకరమే. అలాగే మితంగా చికెన్ తినాలను కునే వారు చికెన్‌లో ఓ పార్ట్‌ను ఎట్టిపరిస్థితుల్లో తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు. అది తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని, గుండె ప్రమాదం కూడా వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇంతకీ చికెన్‌లో ఎలాంటి పార్ట్ తినకూడదు. ఆ పార్ట్ తింటే ఏమవుతుంది అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం రండి.. చికెన్‌లో అందరికీ ఇష్టమైన భాగం ఏదైనా ఉందంటే అది లెగ్ పీస్. ఈ భాగాన్ని చాలా మంది ఎంతో ఇష్టంగా తింటూ ఉంటారు. అయితే చికెన్‌లో ఈ పార్ట్‌ను తినకూడదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే కోళ్ల ఫారాల్లో పెంచే కోళ్లకు రోగాలు రాకుండా ఉండేందుకు సులభంగా వేగంగా బరువు పెరిగేందుకు తొడ భాగంలో ఎక్కువగా ఇంజెక్షన్స్, స్టెరాయిడ్స్ ఇస్తూ ఉంటారు. అందుకే ఈ లెగ్ పీస్ తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని చెబుతున్నారు. అలాగే లెగ్ పీస్‌లో కొవ్వు పదార్థం ఎక్కువగా ఉంటుంది కాబట్టి దానిని తినడం వల్ల.. కొలెస్ట్రాల్ పెరిగి గుండెపోటు కూడా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**ఏం తినాలి?**

డైట్ పాటించే వారికి, ప్రతిరోజూ వర్కౌట్లు చేసే వారికి ప్రోటీన్ ఇన్‌టేక్ అనేది చాలా అవసరం. అలాంటి వారు ముఖ్యంగా చికెన్ మీద ఆధార పడుతుంటారు. ఒకవేళ మీకు కనుక ప్రోటీన్ ఇన్‌టేక్ అవసరముండి, చికెన్ తినాల్సి వస్తే.. ఊర్లలో పెరిగే నాటు కోళ్లను తీసుకోవడం మంచిది. ఇవి సహజంగానే పెరుగుతాయి. అలాగే ఎలాంటి ఇంజెక్షన్స్, స్టెరాయిడ్స్ ఇవ్వరు కాబట్టి ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అదే సమయంలో ఎలాంటి రోగాల బారిన పడకుండా ఉంటాము.

**స్కిన్‌తో తినాలా వద్దా?**

ఇప్పటికీ చాలా మందికి చికెన్ స్కిన్‌తో తినాలా? స్కిన్ లేకుండా తినాలా అనే అనుమానం ఉంటుంది. అయితే చికెన్ స్కిన్ లేకుండా తింటేనే బాగుంటుంది. ఎందుకంటే చికెన్ స్కిన్‌లో కొవ్వు పదార్థాలు, నూనె పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. వాటిని తినడం వల్ల సులువుగా బరువు పెరగడంతో పాటు శరీరంలో చెడు కొవ్వు విపరీతంగా పెరిగిపోతుంది. దీని వల్ల భవిష్యత్తులో గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంటుంది. అయితే ఒమేగా 3, ఒమేగా 6, ఫ్యాటీ యాసిడ్స్ లోపం ఉన్న వ్యక్తులు వారానికి ఒకసారి స్కిన్‌తో పాటు చికెన్ తినొచ్చు.

**రోజూ చికెన్ తింటున్నారా?**

కొందరు ప్రతిరోజూ చికెన్ తింటూ ఉంటారు. ముక్క లేకపోతే వారికి ముద్ద దిగదు. అయితే ప్రతిరోజూ చికెన్ తినడం కూడా అంత మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో ప్రోటీన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది కాబట్టి జీర్ణం కావడం చాలా లేట్ అవుతుందని అది క్రమంగా జీర్ణ వ్యవస్థ, కిడ్నీలపై ప్రభావం చూపుతుందని పేర్కొంటున్నారు. అందుకే నిపుణుల సలహాలతో మితంగా తినాలని సూచిస్తున్నారు.



# పడిక్కల్ ఖాతాలో మరో సెంచరీ..

- రెండో టెస్టులోనూ సెంచరీతో కదం తొక్కిన దేవదత్
- తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ స్కోరు 300/5
- బౌన్సర్ తగిలి రిటైర్డ్ హర్ట్ గా వెనుదిరిగిన రిషబ్ పంత్
- మూడు వికెట్లతో రాణించి లంకను పోటీలో నిలిపిన ఆసిత ఫెర్నాండో
- అర్ధశతకంతో ఆకట్టుకున్న శుభ్‌మన్ గిల్



శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (117) వరుసగా రెండో శతకంతో కదం తొక్కాడు. దీంతో సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ (SSC) మైదానంలో ఆదివారం ప్రారంభమైన మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 5 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. పడిక్కల్ సెంచరీతో భారత్ భారీ స్కోరుపై కన్నేసినప్పటికీ, రెండో కొత్త బంతితో శ్రీలంక బౌలర్లు విజృంభించి కళ్లెం వేశారు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ 45, కేఎల్ రాహుల్ 18 పరుగులు చేశారు. అయితే, శుభ్‌మన్ గిల్ (50) అర్ధశతకంతో ఆదుకున్నాడు. ముఖ్యంగా పడిక్కల్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కట్ షాట్లతో లంక బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు. ఆఖరి సెషన్‌లో రవీంద్ర జడేజా (43)తో కలిసి 74 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. సెంచరీ పూర్తి చేశాక పడిక్కల్ మరింత వేగంగా ఆడాడు. అయితే, ఆఖరి సెషన్‌లో భారత్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. లహిరు కుమార వేసిన పదునైన బౌన్సర్ ఎడమ చేతి మణికట్టుకు బలంగా తగలడంతో వికెట్ కీపర్ రిషబ్ పంత్ రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడాడు. అతని గాయం తీవ్రతపై స్పష్టత రావాల్సి ఉంది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన జడేజా దూకుడుగా ఆడాడు. మరోవైపు, అద్భుతంగా ఆడుతున్న పడిక్కల్‌ను స్పిన్నర్ కేశర నువంత ఔట్ చేశాడు. రెండో కొత్త బంతిని అందుకున్న ఆసిత ఫెర్నాండో, అద్భుతమైన ఇన్‌స్వింగర్‌తో జడేజాను క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో శ్రీలంక శిబిరంలో ఆనందం వెల్లివిరిసింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ధ్రువ్ జురెల్ (7), అరంగేట్ర ఆటగాడు సారాంశ్ జైన్ (4) క్రీజులో ఉన్నారు. లంక బౌలర్లలో ఆసిత ఫెర్నాండో 3 వికెట్లతో రాణించగా, లహిరు కుమార ఒక వికెట్ పడగొట్టాడు. మొత్తంగా తొలి రోజు ఆట ఇరు జట్లకు సమంగా ముగిసింది.

**సంక్షిప్త స్కోర్లు:**
భారత్ తొలి ఇన్నింగ్స్: 85 ఓవర్లలో 300/5 (దేవదత్ పడిక్కల్ 117, శుభ్‌మన్ గిల్ 50; ఆసిత ఫెర్నాండో 346, లహిరు కుమార 138)



## బంగ్లాదేశ్ సరికొత్త చరిత్ర..

- ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి 6వ స్థానానికి
- ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకోవడంతో పెరిగిన ర్యాంకు
- వెస్టిండీస్, పాకిస్తాన్, శ్రీలంక జట్లను వెనక్కి నెట్టిన బంగ్లా టైగర్స్
- ఇది తమకు చారిత్రక విజయమని వ్యాఖ్యానించిన కెప్టెన్ నజ్ముల్ శాంటో
- ఆస్ట్రేలియా వంటి దేశాల్లో తరచుగా సిరీస్‌లు ఆడించాలని విజ్ఞప్తి

బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు టెస్ట్ ఫార్మాట్‌లో సరికొత్త చరిత్రను లిఖించింది. ఐసీసీ ఆదివారం విడుదల చేసిన తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంకును కైవసం చేసుకుంది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో బంగ్లాదేశ్ జట్టు తొమ్మిదో స్థానాన్ని దాటి పైకి రావడం ఇదే ప్రప్రథమం కావడం విశేషం. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో చారిత్రక ప్రదర్శన కనబరచడమే ఈ ఘనతకు కారణమైంది.

ఇటీవల ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను బంగ్లాదేశ్ 11తో సమం చేసింది. తొలి టెస్టులో అద్భుత విజయం సాధించి, రెండో టెస్టులో ఓటమిపాలైంది. ఈ ప్రదర్శనతో 78 రేటింగ్ పాయింట్లతో ఆరో స్థానానికి చేరుకుంది. ఈ క్రమంలో వెస్టిండీస్, పాకిస్థాన్, శ్రీలంక వంటి బలమైన జట్లను వెనక్కి నెట్టింది. ఈ ఘనతపై బంగ్లాదేశ్ టెస్ట్ కెప్టెన్ నజ్ముల్ హోస్సేన్ శాంటో ఆనందం వ్యక్తం చేశాడు. "టెస్టుల్లో ఆరో ర్యాంకుకు చేరుకోవడం కచ్చితంగా శుభవార్తే. ఇది మాకు అతిపెద్ద విజయం" అని వ్యాఖ్యానించాడు. అయితే, రెండో టెస్టులో ఓటమి నేపథ్యంలో, మరింత మెరుగ్గా ఆడి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డాడు.

**తరచుగా పర్యటనలు జరగాలి: కెప్టెన్ శాంటో**
ఈ సందర్భంగా శాంటో కీలక విజ్ఞప్తి చేశాడు. ఆస్ట్రేలియా వంటి దేశాల్లో తమ జట్టు తరచుగా పర్యటించాలని కోరాడు. "మేము 23 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ ఆడాం. ఇలాంటి కఠినమైన పరిస్థితుల్లో, నాణ్యమైన జట్టుతో పోటీపడటం అంత సులభం కాదు. ఇక్కడికి తరచుగా వస్తుంటే, మా ఆటగాళ్లకు పరిస్థితులపై అవగాహన పెరుగుతుంది, అనుభవం వస్తుంది" అని అన్నాడు. కేవలం టెస్టులే కాకుండా, వన్డేలు, టీ20ల కోసం కూడా ఆస్ట్రేలియాకు పర్యటించే అవకాశాలు పెంచాలని విజ్ఞప్తి చేశాడు.

**సిరీస్ సాగిందిలా..**
డార్విన్‌లో జరిగిన తొలి టెస్టులో బంగ్లాదేశ్ చారిత్రక విజయాన్ని అందుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై ఇదే వారి తొలి టెస్ట్ గెలుపు. ఆ మ్యాచ్‌లో తొలుత ఆసీస్‌ను 198 పరుగులకే ఆలౌట్ చేయడంలో హసన్ మహమూద్ (6 వికెట్లు) కీలక పాత్ర పోషించాడు. అనంతరం తంజీద్ హసన్ సెంచరీతో రాణించడంతో బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 426 పరుగుల భారీ స్కోరు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో 57 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. అయితే, రెండో టెస్టులో ఆస్ట్రేలియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. పేసర్ మిచెల్ స్టార్క్ (మ్యాచ్‌లో 10 వికెట్లు) బంగ్లా పతనాన్ని శాసించాడు. అతని ధాటికి బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 64 పరుగులకే, రెండో ఇన్నింగ్స్‌లో 95 పరుగులకే కుప్పకూలింది. ఫలితంగా ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ పర్యటన బంగ్లాదేశ్‌కు ఒకవైపు చారిత్రక ర్యాంకును అందివ్వగా, మరోవైపు కఠిన పరిస్థితుల్లో నిలకడగా రాణించాలంటే మరిన్ని అవకాశాలు అవసరమని గుర్తు చేసింది.

## మూడులో సరైనోడు

భారత క్రికెట్ టెస్టు జట్టులో అవకాశాలు అంత త్వరగా రావు. అరుదుగా దొరికే ఒక్క అవకాశాన్ని అందుకోలేకపోతే కష్టమే. దేవ్‌దత్ పడిక్కల్‌కు రెండేళ్ల క్రితమే ఓ అవకాశం వచ్చింది. ఇంగ్లాండ్‌పై ఓ మోస్తరు ప్రదర్శన చేశాడు. ఆ తర్వాత ఈ ఫార్మాట్లో అతడు కనబడలేదు. మళ్లీ ఇటీవల భారత జట్టులోకి పిలుపొచ్చింది. ఈసారి శ్రీలంకతో సిరీస్‌లో ఆ ఒత్తిడిని అధిగమిస్తూ, అవకాశాలను అందుకుంటూ పడిక్కల్ నిలిచాడు. వరుసగా రెండు టెస్టుల్లోనూ సెంచరీలతో సత్తా చాటి మూడో స్థానానికి బలమైన ప్రత్యామ్నాయంగా మారాడు. గత ఏడాదిగా పడిక్కల్ జోరు మామూలుగా లేదు. టెక్నిక్ మెరుగుపరుచుకుని.. గొప్ప పట్టుదలతో, ఎంతో కసిగా ఆడుతున్నాడు. అన్ని ఫార్మాట్లలోనూ పడిక్కల్ స్థిరంగా రాణిస్తున్నాడు. గత రంజీ సీజన్లో 6 మ్యాచ్‌ల్లో 60కిపైగా సగటుతో 543 పరుగులు చేసిన అతడు.. విజయ్‌హజారే ట్రోఫీలో 9 మ్యాచ్‌ల్లో ఏకంగా 90పై సగటుతో 725 పరుగులు సాధించాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లోనూ ఆర్సీబీ తరఫున ఆకట్టుకున్నాడు. ఈ ప్రదర్శనలతోనే భారత జట్టులోకి పునరాగమనం చేశాడు. శ్రీలంక పర్యటన కోసం బెంగళూరులో కూకాబుర్రా బంతులతో స్పిన్ పిచ్‌లపై ప్రత్యేకంగా సాధన చేయడం అతడికి కలిసొచ్చింది. శ్రీలంక ఎలెవన్‌తో టూర్ మ్యాచ్‌లో పడిక్కల్ అజేయంగా 142 పరుగులు చేసి సత్తా చాటాడు. సాయి సుదర్శన్‌కు గాయం కావడంతో అతడికి తుది జట్టులో చోటు దక్కింది. కీలకమైన మూడో స్థానంలో బరిలో దిగి నిలిచాడు. భారత్ ఘనవిజయం సాధించిన గాలె తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 167 పరుగులు చేసి జట్టు భారీ స్కోరు చేయడంలో ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ కీలకపాత్ర పోషించాడు. బంతి గిరాగిరా తిరుగుతున్న పిచ్‌పై రెండో ఇన్నింగ్స్‌లో కీలకమైన 44 పరుగులు సాధించాడు. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అందుకున్నాడు.

## శుభ్‌మన్ గిల్ అరుదైన రికార్డు..



టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అరుదైన ఘనతను ఖాతాలో వేసుకున్నాడు. టెస్టు క్రికెట్‌లో 3,000 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. భారత్, శ్రీలంక మధ్య కొలంబోలో జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజు ఈ ఫీట్ సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో కేశర నువంత వేసిన 23వ ఓవర్‌లో బౌండరీ కొట్టడంతో గిల్ 3,000 టెస్టు పరుగులను పూర్తి చేసుకున్నాడు. దీంతో అత్యంత పిన్న వయసులో ఈ మైలురాయిని అందుకున్న నాలుగో భారత బ్యాటర్‌గా గిల్ రికార్డుల్లో నిలిచాడు.

శుభ్‌మన్ గిల్ 26 ఏళ్ల 349 రోజుల వయసులో 3,000 టెస్టు పరుగులు పూర్తి చేశారు. దాంతో ఈ ఘనత సాధించిన భారత ఆటగాళ్లలో నాలుగో అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచాడు. ఈ జాబితాలో దిగ్గజ బ్యాటర్ సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో ఉన్నాడు. సచిన్ 23 ఏళ్ల 228 రోజులకే 3,000 టెస్టు పరుగులు పూర్తి చేశాడు. మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ 26 ఏళ్ల 157 రోజుల వయసులో ఈ మైలురాయిని అందుకోగా.. దిలీప్ వెంగ్‌సర్కార్ 26 ఏళ్ల 263 రోజుల వయసులో 3,000 టెస్టు పరుగుల మార్క్‌ను చేరుకున్నాడు. ఇప్పుడు గిల్ నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు.

టీమిండియా టెస్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన శుభ్‌మన్ గిల్‌కు ఈ మైలురాయి మరింత ప్రత్యేకంగా మారింది. భారత టెస్టు జట్టును ముందుండి నడిపిస్తున్న సమయంలోనే 3,000 పరుగుల క్లబ్‌లోకి ప్రవేశించడం అతడి కెరీర్‌లో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. తొలి టెస్టులో శ్రీలంకపై 165 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించింది. ఇప్పుడు రెండో టెస్టులోనూ ఆధిపత్యం కొనసాగించాలనే లక్ష్యంతో గిల్ సేన బరిలోకి దిగింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 32 ఓవర్లలో రెండు వికెట్స్ కోల్పోయి 110 రన్స్ చేసింది. యశస్వి జైస్వాల్ (45), కేఎల్ రాహుల్ (18) పెవిలియన్‌కు చేరారు. శుభ్‌మన్ గిల్ (29), దేవదత్ పడిక్కల్ (22) క్రీజులో ఉన్నారు. ఈ ఇద్దరు మూడో వికెట్‌కు ఇప్పటికి 96 బంతుల్లో 50 పరుగులు జోడించారు.



## ఐపీఎల్ ఆడకుండానే టీమిండియా డెబ్యూ..

- మూడో ఆటగాడిగా సారాంశ్ జైన్ అరుదైన రికార్డు!

శ్రీలంకతో కొలంబోలోని సిన్హలీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో 33 ఏళ్ల సారంశ్ జైన్ టీమిండియా తరఫున అంతర్జాతీయ టెస్టు అరంగేట్రం చేశాడు. సీనియర్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఇన్ఫెక్షన్ కారణంగా ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో.. అతడి స్థానంలో సారంశ్‌కు తుది జట్టులో అవకాశం దక్కింది. జాతీయ జట్టులోకి ఎంపిక కావడంతోనే సారంశ్ ఓ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. 21వ శతాబ్దంలో భారత్ తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేసిన అత్యధిక వయస్కుడిగా సారంశ్ జైన్ నిలిచాడు. సారంశ్ ప్రస్తుత వయసు 33 ఏళ్ల 145 రోజులు. ఇంతకుముందు ఈ రికార్డు సబా కరీం పేరిట ఉంది. 2000లో ఢాకాలో బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టులో సబా కరీం 32 ఏళ్ల 362 రోజుల వయసులో భారత్ తరఫున టెస్టు అరంగేట్రం చేశాడు. ఇప్పుడు సారంశ్ జైన్ 33 ఏళ్ల 145 రోజుల వయసులో అరంగేట్రం చేయడంతో ఆ రికార్డును అధిగమించాడు. సారంశ్ జైన్ అరంగేట్రంతో మరో ప్రత్యేక ఘనతను కూడా అందుకున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే భారత జాతీయ జట్టుకు ఎంపికైన మూడో ఆటగాడిగా నిలిచాడు. ఇంతకుముందు మురళీ విజయ్, మహ్మద్ షమీ ఈ అరుదైన ఫీట్‌ను సాధించారు. విజయ్ 2008లో నాగ్‌పూర్‌లో ఆస్ట్రేలియాపై టెస్టులో అరంగేట్రం చేయగా.. షమీ 2013లో ఢిల్లీలో పాకిస్థాన్‌పై వన్డే ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. సారంశ్ జైన్ చాలా కాలంగా దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నాడు. మధ్యప్రదేశ్ తరఫున ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో మంచి ప్రదర్శనలు చేసిన అతడు.. ఎన్నో ఏళ్ల పాటు జాతీయ జట్టు పిలుపు కోసం ఎదురుచూశాడు. ఇప్పుడు 33 ఏళ్ల వయసులో ఆ కల నెరవేరింది. టెస్ట్ సిరీస్ ముందు లంకఏ జట్టుపై సారాంశ్ ఆకట్టుకున్నాడు. రెండో టెస్టులో 6 వికెట్లు తీయడంతో పాటు బ్యాటింగ్‌లో 70 పరుగులు చేసి బీసీసీఐ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. రెండో టెస్టులో టాస్ గెలిచిన భారత్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. లంచ్ విరామ సమయానికి 25 ఓవర్లలో 88/2 స్కోరుతో ఉంది.

## నిష్క్రమించిన భారత్

**ఆమ్‌స్టెల్వీన్:**

భారత అమ్మాయిల కల చెదిరింది. మహిళల హాకీ ప్రపంచకప్‌లో పతకం గెలవాలనుకున్న వాళ్ల ఆశ నెరవేరలేదు. భారత జట్టు సెమీఫైనల్ చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. ముందంజ వేయాలంటే కచ్చితంగా గెలవాల్సిన పూల్‌ఈ మ్యాచ్‌లో సలీమా బృందం 00తో ఆస్ట్రేలియాతో డ్రా చేసుకుంది. స్టేజ్ 2 ముగిసే సరికి భారత్, చైనా, ఆస్ట్రేలియా తలో రెండు పాయింట్లతో సమంగా నిలిచాయి. కానీ మెరుగైన గోల్ వ్యత్యాసం కారణంగా.. ఆసీస్ గ్రూప్ నుంచి రెండో స్థానంతో సెమీస్‌లో ప్రవేశించింది. పూల్‌ఈలో నెదర్లాండ్స్ ఇప్పటికే సెమీస్ చేరింది. ఆదివారం భారత్‌తో పోరులో రెండో నిమిషంలో ఆస్ట్రేలియా గోల్ కొట్టింది. కానీ గ్రేస్ స్టివార్ట్ కొట్టిన షాట్ ఫౌల్ అని రిఫరీ తేల్చడంతో ఆస్ట్రేలియాకు గోల్ రాలేదు. తొలి క్వార్టర్‌ను రెండు జట్లు 00తో ముగించాయి. రెండో క్వార్టర్‌లోనూ ఆస్ట్రేలియా దాడులు కొనసాగించింది. గోల్ అవకాశాలను సృష్టించుకుంది. కానీ ఆ జట్టు ప్రయత్నాలను భారత డిఫెండర్లు వమ్ము చేశారు.

## ఇంగ్లండ్ పేస్ బౌలర్ కు బేడీలు వేసి తీసుకెళ్లిన పోలీసులు



పాకిస్థాన్‌తో టెస్ట్ సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ జట్టులో కలకలం రేగింది. ఆ జట్టు ఫాస్ట్ బౌలర్ బ్రైడన్ కార్స్‌ను పోలీసులు బేడీలతో అదుపులోకి తీసుకున్న ఘటన కొంచెం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం (ఆగస్టు 22) రాత్రి డెర్బీలోని ఓ నైట్‌క్లబ్ వెలుపల ఈ సంఘటన చోటుచేసుకుంది. దీనిపై ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) విచారణకు ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. డెర్బీలోని 'మోలీ మలోన్స్ ఐరిష్ టావెర్న్' అనే నైట్‌క్లబ్ వెలుపల నలుగురు పోలీసులు కార్స్‌ను చుట్టుముట్టి చేతులకు బేడీలు వేస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. అదే సమయంలో తోటి ఇంగ్లండ్ ఆటగాడు మాథ్యూ పాట్స్ అతడితో మాట్లాడుతుండగా, ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ కూడా ఆ వీడియోలో కనిపించడం గమనార్హం. అయితే పోలీసులు కార్స్‌ను అరెస్ట్ చేయలేదని, కొద్దిసేపటికే విచారించి ఎలాంటి అభియోగాలు నమోదు చేయకుండా విడుదల చేశారని తెలిసింది. క్లబ్ నుంచి బయటకు వచ్చి తిరిగి లోపలికి వెళ్లే క్రమంలో బౌన్సర్లతో వివాదం జరగడమే ఈ గొడవకు కారణమని సమాచారం. పాకిస్థాన్‌తో జరిగిన తొలి టెస్టులో కార్స్ జట్టులో ఉన్నప్పటికీ తుది జట్టులో అవకాశం దక్కలేదు. దీంతో అతడిని కౌంటీ క్రికెట్ ఆడేందుకు ఈసీబీ అనుమతించింది. డర్హామ్ తరఫున ఆడిన మ్యాచ్‌లో కార్స్ రెండు వికెట్లు తీశాడు. ఈ ఘటనపై ఈసీబీ స్పందిస్తూ, "డెర్బీలో జరిగిన సంఘటన మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ జరుపుతున్నాం. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తాం" అని తెలిపింది. ఆగస్టు 27 నుంచి లార్డ్స్‌లో ప్రారంభం కానున్న రెండో టెస్టుకు ప్రకటించిన ఇంగ్లండ్ జట్టులో కార్స్ సభ్యుడిగా ఉన్నాడు. గతంలో బెట్టింగ్ సంబంధిత కార్యకలాపాల కారణంగా కార్స్ మూడు నెలల నిషేధాన్ని ఎదుర్కొన్నాడు. బ్రైడన్ కార్స్ ఐపీఎల్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ టీమ్ కు ప్రాతినిధ్యం వహిస్తాడన్న సంగతి తెలిసిందే.

## జట్టు మారతాడన్న ప్రచారానికి చెక్..
## గోవాకే ఫిక్స్ అయిన అర్జున్



భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు, యువ పేసర్ అర్జున్ టెండూల్కర్ తన దేశవాళీ క్రికెట్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించాడు. రాబోయే దేశవాళీ సీజన్‌లో కూడా అతను గోవా జట్టుకే ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఇటీవల గోవా జట్టు ఒమన్‌లో పర్యటించగా, అర్జున్ ఆ టూర్‌కు దూరంగా ఉన్నాడు. దీంతో అతను గోవా జట్టును వీడి మరో జట్టుకు మారతాడంటూ ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తల్లో నిజం లేదని, అర్జున్ గోవాతోనే కొనసాగుతాడని అసోసియేషన్ వర్గాలు స్పష్టం చేసినట్లు స్పోర్ట్‌స్టార్ తన కథనంలో పేర్కొంది. 202223 సీజన్‌కు ముందు మెరుగైన అవకాశాల కోసం ముంబై నుంచి గోవాకు మారిన 26 ఏళ్ల అర్జున్, అప్పటి నుంచి జట్టులో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ఈ ఎడమచేతి వాటం పేసర్ గోవా తరఫున ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఇప్పటివరకు 50 వికెట్లు పడగొట్టాడు. కేవలం బౌలింగ్‌లోనే కాకుండా బ్యాటింగ్‌లోనూ తన నైపుణ్యాలను గణనీయంగా మెరుగుపరుచుకున్నాడు. రంజీ ట్రోఫీలో రాజస్థాన్‌పై సెంచరీ సాధించి తన బ్యాటింగ్ సత్తాను చాటాడు. దీంతో అన్ని ఫార్మాట్లలోనూ గోవా జట్టుకు అతను ముఖ్యమైన ఆటగాడిగా మారాడు. ఇక ఐపీఎల్ 2026 సీజన్‌లో అర్జున్ లక్నో సూపర్ జెయింట్స్ (LSG) జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన సీజన్ చివరి మ్యాచ్‌లో అరంగేట్రం చేసి, 36 పరుగులిచ్చి ఒక వికెట్ తీశాడు. ఈ మ్యాచ్ అనంతరం సచిన్ టెండూల్కర్ తన కుమారుడి సహనాన్ని, కష్టపడే తత్వాన్ని ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. అవకాశం కోసం ఓపికగా ఎదురుచూసి, దాన్ని సద్వినియోగం చేసుకున్నావంటూ కొనియాడాడు. అంతకుముందు అర్జున్ ముంబై ఇండియన్స్ జట్టులో కూడా సభ్యుడిగా ఉన్నాడు.

## వైభవ్ సూర్యవంశీ.. 300 బంతులు ఆడతాడా ?



టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇప్పటికే ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షిస్తున్నాడు. 15 ఏళ్ల వయసులోనే భారత జాతీయ జట్టులోకి అరంగేట్రం చేసిన బుడ్డోడు.. ఇప్పుడు రెడ్‌బాల్ క్రికెట్‌లో తన సత్తా చాటేందుకు బరిలోకి దిగాడు. దులీప్ ట్రోఫీ 202627 సీజన్‌లో ఈస్ట్ జోన్‌కు వైస్ కెప్టెన్‌గా ఎంపికైన వైభవ్.. త్వరలోనే టెస్టు జట్టులోకి వస్తాడా? అనే చర్చ సోషల్ మీడియాలో వైరల్ మొదలైంది. అయితే టెస్టు క్రికెట్‌లోకి రావాలంటే వైభవ్ మరింత సమయం తీసుకోవాల్సి ఉంటుందని బుడ్డోడి చిన్ననాటి కోచ్ మనీష్ ఓజా అభిప్రాయపడ్డారు. ఇటీవల మనీష్ ఓజా ఓ జాతీయ మీడియాతో మాట్లాడారు. 'వైభవ్ సూర్యవంశీ మొదటి నుంచే రెడ్‌బాల్‌తోనే ఎక్కువగా ప్రాక్టీస్ చేశాడు. వైట్‌బాల్ క్రికెట్ అతడి ప్రయాణంలో చాలా తర్వాత వచ్చింది. అందువల్ల రెడ్‌బాల్ క్రికెట్‌కు అతడు అలవాటు పడలేడనే ఆందోళన అవసరం లేదు. అయితే వైభవ్ ఎంత త్వరగా తన ఆటతీరును మార్చుకుంటాడన్నది కీలకం. వైట్‌బాల్ క్రికెట్‌లో ప్రతి బంతిని దూకుడుగా ఆడుతారు. కానీ టెస్టు క్రికెట్‌లో కొత్త బంతిని ఎదుర్కొంటూ ఓపికగా ఆడటం, సరైన బంతి కోసం వేచి చూడటం, రిస్క్‌ను తగ్గించుకోవడం నేర్చుకోవాల్సి ఉంటుంది' అని అన్నారు.

రెడ్‌బాల్ క్రికెట్‌లో వైభవ్ తన మైండ్‌సెట్‌ను మార్చుకోవాల్సిన అవసరం ఉందని ఓజా అన్నారు. కేవలం బౌండరీలు కొట్టడం కాకుండా.. పరిస్థితికి తగ్గట్టుగా వేర్వేరు పరిస్థితుల్లో బ్యాటింగ్ చేయాలి. సుదీర్ఘ ఇన్నింగ్స్‌ను ఎలా నిర్మించాలో నేర్చుకోవాల్సి ఉంటుందని చెప్పారు. 'ఇన్నింగ్స్‌ను నిర్మించడం నేర్చుకోవాలి. వేర్వేరు గేర్లలో బ్యాటింగ్ చేయాలి. 300 బంతులు ఆడగలనని ప్రపంచానికి చూపించాలి. రెడ్‌బాల్ క్రికెట్‌లో ఈ అనుభవం అతడికి ఇప్పుడు ఎంతో అవసరం' అని ఓజా అభిప్రాయపడ్డారు. 2026 ఐపీఎల్ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున వైభవ్ అద్భుత ప్రదర్శన చేశాడు. టోర్నీలో అత్యుత్తమ బ్యాటర్‌గా నిలిచి ఆరెంజ్ క్యాప్‌తో పాటు ఎంవీపీ అవార్డును కూడా సొంతం చేసుకున్నాడు. ఆ తర్వాత ఇంగ్లండ్‌లో భారత జట్టు తరఫున అరంగేట్రం చేసి మరో ఘనతను అందుకున్నాడు. ఇప్పుడు దులీప్ ట్రోఫీలో రెడ్‌బాల్ ఫార్మాట్‌లో తన సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశం అతడికి దక్కింది. ఈ టోర్నీ ద్వారా టెస్టు క్రికెట్‌కు అవసరమైన సహనం, సాంకేతికత, ఇన్నింగ్స్ నిర్మాణంపై మరింత అవగాహన పెంచుకోవచ్చని కోచ్ భావిస్తున్నారు. వైభవ్ ప్రస్తుతం 15 ఏళ్ల వయసులో ఉన్నాడని.. ఇంత చిన్న వయసులోనే టెస్టు జట్టులోకి రావాలని తొందరపడాల్సిన అవసరం లేదని మనీష్ ఓజా స్పష్టం చేశారు. దేశవాళీ రెడ్‌బాల్ క్రికెట్‌లో అతడికి ఇంకా అనుభవం అవసరమని అన్నారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో వైభవ్ ఇప్పటివరకు పెద్దగా ఆడలేదు. 12 ఇన్నింగ్స్‌ల్లో 207 పరుగులు మాత్రమే చేశాడు. అయితే అండర్19 యూత్ టెస్టుల్లో ఆస్ట్రేలియాపై రెండు సెంచరీలు సాధించడం అతడి ప్రతిభకు నిదర్శనం. దేశవాళీ క్రికెట్‌లో దులీప్ ట్రోఫీ, రంజీ ట్రోఫీ వంటి టోర్నీల్లో ఒక్క సీజన్‌కు పరిమిత సంఖ్యలోనే మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంటుందని ఓజా వివరించారు. ఆ అవకాశాల్లో వరుసగా సెంచరీలు, డబుల్ సెంచరీలు సాధిస్తూ.. కనీసం రెండు, మూడు సంవత్సరాలు నిలకడగా రాణిస్తేనే టెస్టు జట్టులో స్థానం కోసం బలమైన పోటీదారుగా మారతాడని తెలిపారు.



# జపాన్‌లో మిరాయ్ సంచలనం..



యంగ్ హీరో తేజ సజ్జా నటించిన విజువల్ వండర్ 'మిరాయ్' మరోసారి వార్తల్లో నిలిచింది. ఇండియాలో భారీ అంచనాలు లేకుండా విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న ఈ సినిమా.. ఇప్పుడు జపాన్ మార్కెట్‌లో సత్తా చాటుతోంది. ఆగస్టు 21న జపాన్‌లో 'Mirai: Unmei no Senshi' (The Warrior of Destiny) పేరుతో విడుదలైన ఈ చిత్రం.. రిలీజ్‌కు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో సంచలన రికార్డులు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. భారతీయ సినిమాలకు జపాన్‌లో ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడిన విషయం తెలిసిందే. ముఖ్యంగా భారీ విజువల్స్, మైథలాజికల్, హిస్టారికల్ అంశాలతో తెరకెక్కిన సినిమాలకు అక్కడ మంచి ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో 'మిరాయ్' కూడా జపాన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది.ట్రేడ్ ట్రాకర్ల ప్రకారం.. జపాన్‌లో భారతీయ సినిమాల డే1 అడ్వాన్స్ బుకింగ్స్‌లో 'మిరాయ్' టాప్6లో నిలిచినట్లు సమాచారం. అంతేకాదు, అడ్వాన్స్ టికెట్ సేల్స్ పరంగా 'బాహుబలి 2', 'ధురంధర్ 2', 'టైగర్ జిందా హై' వంటి సినిమాలను కూడా అధిగమించినట్లు రిపోర్టులు చెబుతున్నాయి. సినిమా విడుదలకు ముందే ఇలాంటి స్పందన రావడం తేజ సజ్జా అభిమానులతో పాటు ట్రేడ్ వర్గాలను కూడా ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 'మిరాయ్' గతేడాది భారీ అంచనాలు లేకుండానే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే సినిమా కథనం, యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ఎఫెక్ట్స్, భారీ ప్రొడక్షన్ విలువలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో మంచి స్పందన అందుకున్న ఈ చిత్రం రూ.150 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి తేజ సజ్జా కెరీర్‌లో ప్రత్యేకమైన విజయంగా నిలిచింది. ఇప్పుడు అదే సినిమా జపాన్‌లోనూ తన మార్క్ చూపించేందుకు సిద్ధమవుతోంది. అక్కడ అడ్వాన్స్ బుకింగ్స్‌లోనే ఇంతటి స్పందన రావడంతో రానున్న రోజుల్లో సినిమా ఎలాంటి వసూళ్లు సాధిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన 'మిరాయ్'లో మైథలాజికల్, హిస్టారికల్ అంశాలతో పాటు భారీ యాక్షన్, విజువల్ ఎఫెక్ట్స్‌కు ప్రాధాన్యత ఇచ్చారు.



# బాక్సాఫీస్ వద్ద ఢీలా

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది అలియా భట్. ఈ భామ నటించిన తొలి ఫీ మేల్ ఓరియెంటెడ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ అల్ఫా (Alpha). యశ్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లో తెరకెక్కిన ఈ చిత్రాన్ని శివ్ రావైల్ డైరెక్ట్ చేశాడు. యశ్ రాజ్ ఫిలింస్ లాంటి అగ్ర నిర్మాణ సంస్థలో వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద మూవీ లవర్స్‌ను నిరాశపరిచింది. కాగా ఇక ఓటీటీలో తన లక్‌నుపరీక్షించుకునేందుకు రెడీ అయింది. అల్ఫా ఆగస్టు 28 నుంచి పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ప్రస్తుతానికి ఒరిజినల్ హిందీ వెర్షన్ స్ట్రీమింగ్ కానున్నట్టు తెలుస్తుండగా.. డబ్‌డ్ వెర్షన్లకు సంబంధించిన అప్‌డేట్ రావాల్సి ఉంది. శార్వరి మరో లీడ్ రోల్‌లో నటించిన ఈ మూవీలో అనే కామియో రోల్‌లో హృతిక్ రోషన్ కబీర్ నటించాడు. బాబీ డియోలక్ష, అనిల్ కపూర్ ఇతక కీలక పాత్రలు పోషించారు. భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద ఢీలా పడిపోయిన అల్ఫా మరి ఓటీటీలో ఎలాంటి స్పందన రాబట్టుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# కంగనాతో వివాదంపై తాప్సీ ఘాటు వ్యాఖ్యలు..

బాలీవుడ్‌లో వివాదాస్పద వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలిచే నటీమణుల్లో కంగనా రనౌత్, తాప్సీ పన్ను ముందువరుసలో ఉంటారు. కొన్నేళ్ల క్రితం వీరిద్దరి మధ్య సోషల్ మీడియా వేదికగా జరిగిన మాటల యుద్ధం బాలీవుడ్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. అయితే తాజాగా ఈ వివాదంపై తాప్సీ పన్ను మరోసారి స్పందించింది. కంగనాతో తనకు ఇప్పటివరకు నేరుగా పరిచయం కూడా లేదని చెబుతూనే.. వ్యక్తుల వ్యాఖ్యలు వారి పెంపకం, ప్రపంచాన్ని చూసే విధానాన్ని ప్రతిబింబిస్తాయని వ్యాఖ్యానించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాప్సీని కంగనా రనౌత్‌తో ఉన్న విభేదాల గురించి ప్రశ్నించారు. దీనికి ఆమె స్పందిస్తూ.. కంగనాను ఇప్పటివరకు తాను నేరుగా కలవలేదని తెలిపింది.వివాదాలు మొదలయ్యే ముందు కూడా, ఆ తర్వాత కూడా ఆమెను వ్యక్తిగతంగా కలిసిన సందర్భం లేదని తాప్సీ స్పష్టం చేసింది. అయితే ఇద్దరి మధ్య గతంలో చోటు చేసుకున్న సోషల్ మీడియా వివాదాలపై తన అభిప్రాయాన్ని మాత్రం వెల్లడించింది. కంగనాతో జరిగిన వివాదాల గురించి మాట్లాడుతూ తాప్సీ కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక వ్యక్తి మరొకరి గురించి ఎలా మాట్లాడుతున్నారనే విషయం వారి కుటుంబ నేపథ్యం. పెంపకం. ప్రపంచాన్ని చూసే విధానం గురించి తెలియజేస్తుందని ఆమె అభిప్రాయపడింది. ఒకరి వ్యాఖ్యలను బట్టి వారు ఎలాంటి వాతావరణంలో పెరిగారో అర్థం చేసుకోవచ్చని పేర్కొంది. తన వ్యాఖ్యలు ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయడానికి కాదని, సాధారణంగా వ్యక్తుల ప్రవర్తన గురించి చెబుతున్నాననే విధంగా తాప్సీ తన అభిప్రాయాన్ని వెల్లడించింది. గతంలో తాప్సీ, కంగనా మధ్య వివాదం సోషల్ మీడియాలో తీవ్రస్థాయికి చేరింది. కంగనా సోదరి రంగోలి చందేల్.. తాప్సీని 'సస్తీ కాపీ' అంటూ విమర్శించింది. ఆ తర్వాత కంగనా కూడా తాప్సీని 'బిగ్రేడ్ నటి' అంటూ వ్యాఖ్యానించడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. అయితే తాను ఎప్పుడూ కంగనాకు వ్యతిరేకంగా మాట్లాడలేదని తాప్సీ చెప్పింది. కంగనా మంచి నటి అని అంగీకరించడానికి తనకు ఎలాంటి అహం లేదని స్పష్టం చేసింది. వ్యక్తిగత విభేదాలు ఉన్నప్పటికీ ఒక నటిగా కంగనా ప్రతిభను తాను గౌరవిస్తాననే సంకేతాన్ని తాప్సీ ఇచ్చింది.



## భన్సాలీ మైథలాజికల్ మూవీలో

# కరీనా, ధనుష్!

సంచలన దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్, టాలెంటెడ్ హీరో ధనుష్ ప్రధాన పాత్రల్లో ఓ భారీ ప్రాజెక్ట్ తెరకెక్కనున్నట్లు గత కొంతకాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై ప్రముఖ దర్శకుడు పి.ఎస్. మిత్రన్ స్పందిస్తూ ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చారు. 'సర్దార్ 2' ప్రమోషన్స్‌లో భాగంగా ఒక మీడియాతో మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, డేట్స్ సర్దుబాటు చేసే పనిలో ఉన్నామని, త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందని ఆయన ధృవీకరించారు.ఈ సినిమా పూర్తిగా మైథలాజికల్ నేపథ్యంలో సాగే ఓ భారీ అడ్వెంచర్ జంగిల్ డ్రామాగా తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ తుది దశకు చేరుకుందని, దీని ప్రీప్రొడక్షన్ పనులు 2026 నవంబర్‌లో ప్రారంభమై, 2027 జనవరి నుంచి రెగ్యులర్ షూటింగ్ సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉందని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఈ సినిమాతో దర్శకుడు పి.ఎస్. మిత్రన్ హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టనున్నారు. అంతేకాకుండా, ఈ చిత్రంలో ధనుష్ మరియు కరీనా కపూర్ జంటగా నటించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. మరోవైపు, 'దేవ్‌దాస్' చిత్రం తర్వాత కరీనా కపూర్, సంజయ్ లీలా భన్సాలీ కాంబినేషన్‌లో మళ్లీ ఇన్నాళ్లకు సినిమా వస్తుండటంతో సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 2002లో వచ్చిన 'దేవ్‌దాస్' చిత్రంలో ముందుగా కరీనాను సంప్రదించినప్పటికీ, ఆ తర్వాత ఆ పాత్ర అశ్వర్యరాయ్ బచ్చన్‌కు వెళ్లడంతో వీరి మధ్య చిన్నపాటి మనస్పర్థలు వచ్చాయి.




పాపులర్ ఫ్యాషన్ యాక్సెసరీస్ బ్రాండ్ Victoria's Secretకు యానిమల్ భామ తృప్తి డిమ్రి తొలి బ్రాండ్ అంబాసిడర్‌గా నియామకమైన విషయం తెలిసిందే. ఈ బ్రాండ్ రీసెంట్‌గా ఇప్పుడు ఇండియాలో సరికొత్త ఐకానిక్ సెక్సీ కలెక్షన్స్‌ను లాంచ్ చేసి నూతన అధ్యాయాన్ని ప్రారంభించింది. ఈ క్యాంపెయిన్ కోసం బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో మెరిసింది తృప్తి డిమ్రి. బ్లాక్ స్టైలిష్ కాస్ట్యూమ్స్‌లో డైమండ్ జ్యువెలరీ, సాఫ్ట్ వేవ్స్, రేడియేటింగ్ బోల్డ్ అవతార్‌లో గ్లామరస్‌గా కనిపిస్తూ కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది.ఢిల్లీలోని ఆంబియెన్స్ మాల్స్ విక్టోరియా సీక్రెట్ వద్ద కొత్త కలెక్షన్ లాంచ్ చేశారు. సెక్సీ కలెక్షన్లు ఎప్పుడూ కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే స్వయం వ్యక్తీకరణను మరింత పెంపొందించే విధంగా చేస్తాయని తృప్తి డిమ్రి చెప్పుకొచ్చింది. తృప్తి డిమ్రి ఈ ఏడాది ఓ రోమియో, మా బెహన్ సినిమాల్లో మెరిసింది. ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లో ప్రభాస్ నటిస్తోన్న స్పిరిట్‌లో ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

# టాక్ ఆఫ్ ది టౌన్‌గా కొత్త కలెక్షన్

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com